


# విజయభాను


హైదరాబాద్, మంగళవారం 29-08-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 36 సంచిక : 347 పేజీలు : 8 వెల : 1 రూపాయి




# నంద్యాల టీడీపీదే...

- ప్రతిష్టాత్మక పోరులో టీడీపీ విజయభేరి
- 27,466 ఓట్ల భారీ మెజార్టీతో విజయం
- ఓటర్ల బ్రహ్మరథానికి తీర్పు నంద్యాల ఫలితం
- చతికిలబడ్డ వైకాపా

నంద్యాల : తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ఉత్కంఠ రేపిన నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ ఎన్నికలో ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారు. తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని బ్రహ్మాండమైన మెజార్జీతో గెలిపించారు. 27,466 ఓట్ల ఆధిక్యంతో ఆయ్న ఘన విజయం సాధించారు. మొత్తం ఓట్లలో తెదేపాకు 56 శాతం ఓట్లు రాగా.. వైకాపాకు 40 శాతం ఓట్లు వచ్చాయి. దాదాపు ప్రతి రౌండ్‌లో తెదేపా అభ్యర్థికి ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. సమీప ప్రత్యర్థి, వైకాపా అభ్యర్థి శిల్పామోహన్ రెడ్డి ఏ దశలోనూ ఆధిక్యాన్ని కనబరచలేక పోయారు. ఇక కాంగ్రెస్ సుమారు వెయ్యి ఓట్లకే పరిమితమైంది. మొత్తం 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు కొనసాగింది. తెదేపా అభ్యర్థికి 97,076 ఓట్లు రాగా.. వైకాపా అభ్యర్థికి 69,610 ఓట్లు వచ్చాయి.

నంద్యాల ఉప ఎన్నికను అటు అధికార తెదేపా, ఇటు విపక్ష వైకాపా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారు ఈ ఎన్నిక ఫలితంపై ఎంతో ఆసక్తి కనబరిచారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ఈ ఫలితాలు మార్గనిర్దేశం చేస్తాయని, ప్రభుత్వ తరువాయి 2లో

### ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో

## వృత్తులను అనుసంధానం చేయాలి

నారాయణగూడ: మన వృత్తులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేస్తే ఆర్థికాభివృద్ధికి గొప్ప వేదిక అవుతుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో ముదిరాజ్ టైమ్స్ పత్రిక ప్రారంభోత్సవ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. నీ గురించి ఒకడు చెప్పలేనప్పుడు నీ చరిత్రను నవ్వే రాసుకోవాలన్నారు. గతించబడ్డ గొప్ప చరిత్రను వెలికి తీసి, నువ్వు చిన్నవాడివి కాదూ.. నీకో చరిత్ర ఉంది. నువ్వూ గొప్పవాడివే అని తెలియజేసే ప్రయత్నం జరగాలన్నారు. మాకు మేమే కాదూ.. సమాజంలో మేము భాగమే. ఎక్కడ దుర్మార్గం ఉన్నా.. ఎదిరించే దాంట్లో మా గొంతు, సంఘీభావం ఉంటుందని చెప్పగలగాలన్నారు. ఎంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా మనిషికి అన్నం పెట్టేది భూతల్లి, వృత్తి మాత్రమే అనే వాస్తవాన్ని మనమంతా గ్రహించాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రాకెట్ సైన్స్‌లు నేటికీ గ్రామీణ ప్రాంత బతుకులు మార్చలేదు. కాబట్టి వ్యవసాయం, దానికి అనుబంధంగా ఉన్న కులవృత్తులను ప్రోత్సహించాలని తరువాయి 2లో

## ప్రజా ఉద్యమాల అణచివేతకు వ్యతిరేకంగా జాతీయ సదస్సు

### సెప్టెంబరు 2, 3వ తేదీల్లో..



గన్‌ఫౌండ్రి: ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ అణచివేత చర్యలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 2, 3వ తేదీల్లో అఖిల భారత సదస్సు నిర్వహించనున్నట్లు పౌర హక్కుల సంఘం నేతలు వెల్లడించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌర హక్కుల సంఘం నేతలు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, వి.రఘునాథ్, క్రాంతి చైతన్య, ఇస్మాయిల్, పీఎం రాజు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సుకు సంబంధించిన గోడ పత్రికను వారు తరువాయి 2లో


## ప్రాజెక్టుల నిర్మాణాలపై బహిరంగ చర్చకు సిద్ధం

### కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



కరీంనగర్ : ప్రాజెక్టుల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ ఏనాడూ వ్యతిరేకం కాదని, 2014 సంవత్సరానికి ముందు ఎన్ని ప్రాజెక్టుల నిర్మించామో.. ఎన్ని లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామో నిరూపించడానికి తాము సిద్ధమని, దీనిపై ప్రభుత్వం బహిరంగ చర్చకు రావాలని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టులకు అడ్డు వస్తోందని పదే పదే మంత్రి హరీశ్‌రావు విమర్శలు మానుకోవాలని, లేదంటే తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్మాణం చేత కాకపోవడంతోనే కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎల్ఎండీ, ఎస్ఆర్ఎస్పీ, మధ్య మానేరులో 70 శాతం పనులు, ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎవరు కట్టారని ప్రశ్నించారు. వరదకాల్వకు 2004లో మంత్రిగా ఉండి తట్టెడు మట్టి పోయలేదన్నారు. మేడిగడ్డను మహారాష్ట్రలో తాకట్టు పెట్టారన్నారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, భూములు కోల్పోయిన బాధితులు కోర్టులను ఆశ్రయిస్తే కాంగ్రెస్‌పై నెట్టివేయడం సరైంది కాదన్నారు. గౌరవెల్లిలో ఆ గ్రామానికి తరువాయి 2లో

## డేరా బాబాకు పదేళ్ల జైలు



### సీబీఐ న్యాయస్థానం తీర్పు

రోహ్‌తక్: అత్యాచారం కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు శిక్ష ఖరారైంది. ఈ కేసులో అతడికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ.. సీబీఐ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. గుర్మీత్‌ను దోషిగా తేల్చుతూ తీర్పు చెప్పిన అనంతరం చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల దృష్ట్యా రోహ్‌తక్ జైలులోనే ఓ ప్రత్యేక గదిలో న్యాయ విచారణ చేపట్టిన సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ జగ్దీప్ సింగ్ ఈ మేరకు శిక్షను ఖరారు చేశారు. ఇద్దరు మహిళలపై తరువాయి 2లో

## కొత్త సీజేఐగా దీపక్ మిశ్రా ప్రమాణస్వీకారం



న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ దీపక్ మిశ్రా సోమవారంనాడు ప్రమాణస్వీకారం చేశారు. నిన్నమొన్నటి వరకూ సీజేఐగా ఉన్న జస్టిస్ జేఎస్ ఖెహర్ స్థానంలో ఆయన కొత్త సీజేఐగా బాధ్యతలు తరువాయి 2లో

## బెదిరింపులకు పాల్పడ్డారు

### తెదేపా రూ.200కోట్లు ఖర్చుచేసింది

### ప్రతిపక్షనేత, వైకాపా అధ్యక్షుడు జగన్



హైదరాబాద్: నంద్యాల ఉపఎన్నిక సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని వైకాపా అధినేత జగన్ ఆరోపించారు. నంద్యాల ఉపఎన్నిక ఫలితంపై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఎన్నిక కోసం తెదేపా కనీసం రూ.200కోట్లు ఖర్చు చేసింది. తెదేపా నేతలు ఓటర్ల ఇంటికి వెళ్లి భయభ్రాంతులకు గురిచేశారు. ఇంటింటికీ వెళ్లి తమ పార్టీకి ఓటేయకపోతే ఫించన్ ఇవ్వమని బెదిరించారు. ఏకంగా వైకాపా అభ్యర్థిపైనే దాడికి యత్నించారు. పోలీసులను తరువాయి 2లో






## టేకిట్-ఈజీ



మీకేం ఖంగారు లేదుసార్. నంద్యాల తేలిపోయింది కదా కాకినాడ కూడా టీడీపీ ఖాతాలోకే!!

### పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు చేయడం

## ఎంతో అభినందనీయం

- తోటి వారికి సహాయం చేసిన నాడే జీవితానికి సార్థకత
- బొగ్గు శ్రీను సేవలు నిరుపమానం
- జీవితంలో మరిన్ని శిఖరాలను అధిరోహించాలి
- విశాఖ నగర జాయింట్ కమిషనర్ నాగేంద్ర కుమార్



కంచరపాలెం : పుట్టిన రోజు నాడు ఆటపాటలే కాకుండా పరులకు సేవాతత్పరతతో సహాయం చేసిన నాడే పుట్టిన రోజుకు అర్థం, పరమార్థం ఉంటుందని, ఈ కోవకు చెందిన యువకుడు, సంఘసేవకుడు బొగ్గు శ్రీను జన్మ దినోత్సవానికి హాజరై, మెగా రక్తదాన శిబిరాన్ని విశాఖ నగర జాయింట్ కమిషనర్ నాగేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తరువాయి 2లో

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వృత్తులను అనుసంధానం చేయాలి

ప్రయత్నం సంకల్పించిందన్నారు. వృత్తులను ఆధునికీకరించే ప్రయత్నం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ ముదిరాజ్ మహాసభ గౌరవ అద్యక్షులు రోటం భూపతి ముదిరాజ్, అధ్యక్షులు బండ ప్రకాశ్ ముదిరాజ్, చొప్పరి శంకర్ ముదిరాజ్, సీనియర్ జర్నలిస్టులు బలరామ్ ముదిరాజ్, శివకేశవ్ ముదిరాజ్, ముదిరాజ్ టైమ్స్ సంపాదకుడు డా.ఆర్.వినోద్‌కుమార్ పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## ప్రజా ఉద్యమాల అణచివేతకు వ్యతిరేకంగా జాతీయ సదస్సు

ఆవిష్కరించారు. నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వచ్చే నెల 2న సదస్సు ప్రారంభమవుతుందని, మొదటి రోజు ఆదివాసీ మహిళలపై రాజ్యహింస అంశంపై సోనీసోరీ, ప్రజా ఉద్యమాలపై అణచివేత.. న్యాయ వ్యవస్థ అంశంపై క్రాంతి చైతన్య, జాతీయ ఉద్యమాలు - రాజ్యం అణచివేత అంశంపై గౌతం నవలాఖ తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు. రెండో రోజు (సెప్టెంబరు 3న) పత్రికా స్వేచ్ఛ - రాజ్య నిర్భంధం అంశంపై మాలినీసుబ్రహ్మణ్యం, పౌర ప్రజాస్వామిక హక్కుల ఉద్యమాలు - కార్యచరణ అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్, హిందూ ఫాసిజం - దళితులు, మైనార్టీలు అనే అంశంపై ప్రొఫెసర్ ఆనంద్ తేల్‌తుంబ్డే తదితరులు ప్రసంగిస్తారన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రధాన భవనంలో జరిగే ఈ సభకు దేశవ్యాప్తంగా ఉన్న హక్కుల సంఘాల నేతలు హాజరై ప్రసంగిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజా కళామండలి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

## ప్రాజెక్టుల నిర్మాణాలపై బహిరంగ చర్చకు సిద్ధం

చెందిన నలుగురిలో తెరాసకు చెందిన వారే కోర్టుకు వెళ్లారని, అవసరమైతే నిఘా విభాగంతో తెలుసుకోవాలన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి పూర్తిగా అబద్ధాల భజనమండలి శాఖగా మారారని ఎద్దేవా చేశారు.

వచ్చే ఏడాదికి కాళేశ్వరం నీళ్లు ఇస్తామని 2016 ఆగస్టు 27న స్వయంగా విలేకరుల సమావేశంలో మంత్రి హరీశ్‌రావు ప్రకటించారని, ఏడాది పూర్తవుతున్నా నీళ్లు లేకపోగా పర్యావరణ అనుమతుల పేరుతో జాతర నడిపిస్తున్నారని మండి పడ్డారు. అనుమతులు రాకపోతే పనులు, శంకుస్థాపనలు ఎలా చేస్తారని నిలదీశారు.

## పారిశ్రామిక వ్యర్థాల నియంత్రణకు ఒప్పందాలు

బెంగళూరు : బెంగళూరు, మంగళూరు, బంగ్లాదేశ్‌లలో ఎనిమిది దుస్తుల పరిశ్రమలను నిర్వహిస్తున్న తమ సంస్థ థ్రెడ్‌సాల్ సంస్థతో వ్యాపార ఒప్పందాన్ని కుదుర్చుకుందని కె.మోహన్ అండ్ కంపెనీ ముఖ్య కార్యనిర్వహణ అధికారిణి అంగై మహతని వెల్లడించారు. ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఒప్పందాల్లో భాగంగా తాము బిగ్‌డేటా, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విభాగా లకు తమ వ్యాపారాన్ని విస్తరించుకుంటు న్నామని వివరించారు. ఈ ఒప్పందాలతో తాము నిర్వహిస్తోన్న పరిశ్రమలో వ్యర్థాలను నియంత్రించుకునేందుకు, వ్యాపారాన్ని మరింత విస్తరించుకునేందుకు సహకరిస్తుందని ఆమె వివరించారు.

# ఏపీఎస్‌ఆర్టీసీ సొంత పార్సిల్ సేవలు

బెంగళూరు : ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా సరకులను పంపుకొనేందుకు ఇప్పటి వరకు ఏఎన్ఎల్ పార్సిల్ సర్వీసు సేవల్ని అందిస్తూ వస్తోంది. ఇకపై ఏపీఎస్‌ఆర్టీసీ సొంతంగా కొరియర్ సేవలను అందిస్తుందని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎస్.వి.ప్రభాకర్ తెలిపారు.

మెజెస్టిక్ బస్టాండ్, శాంతలా సిల్క్ బస్ టెర్మినల్, ఐటీఐ గేట్ల నుంచి ఆంధ్రాకు వెళ్లే బస్సుల ద్వారా కొరియర్‌ను పంపుకొనేందుకు అవకాశం ఉంటుందని వెల్లడించారు. నిషేధిత వస్తువులు మినహా అన్నింటికీ తమ బస్సుల ద్వారా నిర్వహించే పార్సిల్, కొరియర్ సేవలను వినియో గించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వీటికి సంబంధించిన మరిన్ని వివరాలను 9945516545 అనే నంబరులో పొందవచ్చని ఆయన ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా నువాఖాయి భేట్‌ఘాట్ ఉత్సవాలు



బరగఢ్ : సంబల్‌పూర్ నగరంలోని శ్యామలేశ్వరీ కల్యాణ మండపంలో నువాఖాయి భేట్‌ఘాట్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అక్షయరాయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సంబల్‌పూర్ ఎమ్మెల్యే రాశేశ్వరి పాణిగ్రహి ముఖ్యఅతిథిగా విచ్చేసారు. మాజీ మంత్రి జయనారాయణ మిశ్ర సమ్మానిత అతిథిగా విచ్చేసారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ పశ్చిమ ఒడిశా ప్రజల విశిష్ట ఉత్సవం నువాఖాయి అని అన్నారు. ఈ పండగకు ప్రతి ఒక్కరూ తమకంటే పెద్దవారి కాళ్లకు నమస్కారం చేసి ఆశీర్వాదం పొందుతారన్నారు. ఒకరికొకరు నువాఖాయి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం వివిధ విభాగాల్లో కళాకారులను సన్మానించారు. అనంతరం నిర్వహించిన సంబల్‌పూరీ నృత్యాలు అలరించాయి. బరగఢ్ పట్టణంలోనూ భేట్‌ఘాట్ ఉత్సవాలు జరిగాయి.

కజూర్‌టికిరా బలరామ్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి భాజపా నేత అశ్విని షడంగి ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారులను సన్మానించారు.

# నూతన సిలబస్‌తో ఉద్యోగావకాశాలు

### విద్యాశాఖ మంత్రి సెంగోట్టయ్యన్

చెన్నై : రాష్ట్ర (స్టేట్) బోర్డు సిలబస్‌లో చదువుతున్న విద్యార్థులకు 2018- 19 నుంచి అందుబాటులోకి రానున్న నూతన పిలబస్‌తో ఉపయోగ ఉంటుందని రాష్ట్ర విద్యా, క్రీడలు, యువజన సంక్షేమ శాఖ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ అన్నారు. క్రీడా పోటీల్లో విజేతలైన వారికి బహుమతుల పంపిణీ కార్యక్రమం గోబిచెట్టిపాలెయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బహుమతుల పంపిణీ అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసం గించారు. రాష్ట్రంలోని సిలబస్‌ను పునరు ద్ధరించడానికి పూర్తి స్థాయిలో సన్నాహాలు ప్రారంభమయ్యాయని, 2018- 19 నుంచి ఇవి అమలవుతాయని, ఈ సిలబస్‌తో చదివే వారు మంచి ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటున్నారు. విద్యాశాఖ అధికారులు పాఠ్యాంశాలలో మార్పు చేర్పుల కోసం చేస్తున్న పనులు వేగంగా జరుగు తున్నాయని, పదిహేను రోజుల్లో అవి పూర్తవుతాయని మంత్రి వివరించారు. 54 వేల ప్రశ్నలు, వాటికి సమాధానాలు, స్మార్ట్ కార్డులను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికి వారం రోజుల్లో అందజేస్తామన్నారు. నంబి యూరులో క్రీడా మైదానం నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ఈరోడ్ వీఓసీ పార్కులో అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేసిందని, ప్రస్తుతం రూ.3.50 కోట్లు విడుదల చేసిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## బాలగణపతి బాయిస్ క్లబ్ రక్తదాన శిబిరం

ఖరగ్‌పూర్ : పట్టణ ఖరీదా బాలగణపతి బాయిస్ క్లబ్ గణపతి పూజలలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించింది. మొత్తం 30మంది రక్తదానం చేశారు. డాక్టర్ ఎస్.ఎ.నజ్మి అతిథిగా హాజరై రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు. నిర్వాహక సంస్థ విశాల్ సింగ్ స్మృతిలో ఈ రక్తదాన శిబిరం గణపతి పూజల సందర్భంగా నిర్వహించినట్లు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరానికి

# అనూహ్య స్పందన

రాయగడ : పట్టణంలోని బాలాజీ నగర్ కల్యాణ వేంకటేశ్వర ఆలయ కల్యాణ మండపంలో శ్రీవాసవీ కళింగ వైశ్య సంఘం వేంకటేశ్వర పెంటో ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో విశాఖకు చెందిన ప్రముఖ ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు టి.రమణమూర్తి హాజరై రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యుడు కృష్ణమోహన్ కుముందాన్ పాల్గొన్నారు. వేంకటేశ్వర పెంటో టి.జయరాం, సంఘం అధ్యక్షుడు ఇప్పిలి సన్యాసిరాజు, కార్యదర్శి కింతలి రాజు, కన్వీనర్ వి.వెంకటరావు, సభ్యులు పాల్గొని సహకారం అందించారు. పట్టణంలోని వివిధ వార్డులు, గ్రామాల నుంచి రోగులు వచ్చారు.

## అభ్యర్థుల ఎంపికకు సమీక్ష: యడ్యూరప్ప

బెంగళూరు : వచ్చే శాసనసభ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పార్టీ సమీక్ష నిర్వహిస్తోందని భాజపా అధ్యక్షుడు యడ్యూరప్ప వెల్లడించారు. స్థానికులు, కార్యకర్తలు, నాయకులతో సమీక్ష నిర్వహించి నియోజకవర్గాలకు అభ్యర్థులను ఎంపిక చేయాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తమకు సూచించారని తెలిపారు. ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, కార్యకర్తల నుంచి మద్దతు లభించిన అభ్యర్థికే పార్టీ బి ఫారాలను అందిస్తుందని స్పష్టీకరించారు. దీనికి సంబంధించి తాము గ్రామ, తాలూకా, జిల్లా స్థాయుల్లో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సమీక్ష తరువాత పార్టీ ఎంపిక చేసి టిక్కెట్టు కేటాయించిన అభ్యర్థికే ప్రతి కార్యకర్త, నాయకుడు మద్దతు పలికి ప్రచారం చేయవలసి ఉంటుందని వివరించారు. శివమొగ్గ, ఉడుపి, చిక్కమగళూరు, ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, బెంగళూరు జిల్లాల పథాధికారులతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. ప్రభుత్వ వె%ఫల్యాలను ప్రజల ముందుకు తీసుకు వెళ్లటం, పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు సూచనలను ఆలకించారు. అన్ని జిల్లాల్లో భాజపా మోర్చాలను బలోపేతం చేసేందుకు తక్షణమే కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఆయన మాజీ మంత్రులు, శాసనసభ్యులను ఆదేశించారు.

## స్వచ్ఛ ఆహార్ కోసం తనిఖీలు

బరగఢ్ : సంబల్‌పూర్ మండల రైల్వే ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛరైల్, స్వచ్ఛభారత్ కార్యక్రమాలలో భాగంగాస్వచ్ఛఆహార్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో మండల పరిధిలోని వివిధ రైల్వే స్టేషన్లలోని ప్లాట్‌ఫాంపై ఉన్న టీదుకాణాలు, క్యాంటీన్లు పరిశీలించి రైల్వే అధికారులు స్వచ్ఛ ఆహార్ చేపట్టారు. ప్రయాణికులకు ఆహార సరఫరాలో నాణ్యత గురించి నమూనాలను సేకరించారు.

# గణపయ్యకు ఘన వీడ్కోలు



బెంగళూరు : నగరంలో జోరుగా గణపతి విగ్రహాల్ని భక్తులు నిమజ్జనం చేశారు. ఆదివారం సెలవు కావడంతో తమ ఇళ్లు, వీధుల్లో పూజించిన వినాయకుడి విగ్రహాల్ని భక్తిశ్రద్ధలతో ఆయా ప్రాంతాల్లోని పుష్కరిణిల వద్దకు తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. విగ్రహాల నిమజ్జనం కోసం పాలికె 36 చెరువుల వద్ద పుష్కరిణులు, వార్డుకు ఓ తాత్కాలిక పుష్కరిణి ఏర్పాటు చేసింది. గత రెండ్రోజుల్లో 2.87 లక్షల విగ్రహాల్ని భక్తులు నిమజ్జనం చేశారని అధికారులు తెలిపారు. హలసూరు, యడియూరు, శాంకి, హెబ్బాళ్, మడివాళ, యలహంక, దాసరహళ్లి తదితర ప్రాంతాల్లోని పుష్కరిణి ప్రాంతాలు భక్తుల రద్దీతో నిండిపోయాయి. ఎక్కువగా మట్టి విగ్రహాల్ని తెచ్చి నిమజ్జనం చేయడం విశేషం. పుష్కరిణి వద్దకు తెచ్చిన విగ్రహాలకు ముందుగా పూజలు చేశారు. విగ్రహాలపై పూలు, ఆకులు, పండ్లు లేకుండా అక్కడ ఉన్న పాలికె సిబ్బంది తనిఖీ చేసి భక్తుల్ని లోపలకు వదులుతున్నారు. నీరు చెత్తమయం కాకుండా ఈసారి పాలికె అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ప్రతి పుష్కరిణి వద్ద 50మంది పాలికె సిబ్బందిని నియమించారు. విగ్రహాల్ని నీటిలో నిమజ్జనం చేసేందుకు 25 మంది యువకులతో పాటు ఆరుగురు గజ ఈతగాళ్లను నియమించారు. పెద్ద విగ్రహాల్ని నిమజ్జనం చేసేందుకు క్రేన్‌ను సిద్ధంగా ఉంచారు. హలసూరు చెరువు వద్ద పుష్కరిణి పూర్తిగా భక్తులతో నిండిపోయింది. నగరంలో నివసిస్తున్న విదేశీయులు కూడా వినాయకచవితి ఆచరించి విగ్రహాల్ని నిమజ్జనం చేశారు. ఉదయం ఆరుగంటల నుంచి రాత్రి పదిగంటల వరకు విగ్రహాల నిమజ్జనానికి అవకాశం కల్పించారు. రాత్రికి బెంగళూరులో భారీ వర్షం వచ్చినా భక్తులు ఉత్సాహంగా నిమజ్జన ప్రక్రియలో పాల్గొన్నారు.

మైసూరు:

నగరంలో ఎక్కడ చూసినా వినాయక విగ్రహాల నిమజ్జనమే. అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా గట్టి బందోబస్తు ఏర్పాటైంది. రాచనగరి మైసూరులో సామూహిక విగ్రహాల నిమజ్జనాన్ని నిర్వహించారు. వూరేగింపులో లోక్‌సభ సభ్యుడు ప్రతాప్‌సింహ తదితరులు పాల్గొన్నారు.

## డేరా బాబాకు పదేళ్ల జైలు

గుర్మీత్ అత్యాచారానికి పాల్పడినట్లు 2002లో కేసు నమోదైంది. పదిహేనేళ్ల నాటి ఈ కేసులో ఆగస్టు 25న పంచకులలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం గుర్మీత్‌ను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. దీంతో గుర్మీత్‌ను అరెస్టు చేసి రోహ్‌తక్ జైలుకు తరలించారు. గుర్మీత్‌ను దోషిగా తేల్చడంతో పంచకుల సహా పంజాబ్, హరియాణాలోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. గుర్మీత్ అనుచరులు విధ్వంసం సృష్టించారు. వందల సంఖ్యలో కార్లకు నిప్పంటించారు. ఈ ఘటనలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా శిక్షను ఖరారు చేసేందుకు రోహ్‌తక్ జైలులోనే న్యాయమూర్తి విచారణ చేపట్టారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం జస్టిస్ జగ్దీప్ సింగ్ శిక్షను చదివి వినిపించారు.

**ఆయనో సామాజిక కార్యకర్త**

గుర్మీత్‌కు శిక్ష ఖరారు చేసేందుకు మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణ చేపట్టిన జస్టిస్ జగ్దీప్ సింగ్.. ఇరు పక్షాలు తమ వాదనలు వినిపించేందుకు పది నిమిషాల సమయమిచ్చారు. ఈ సమయంలో గుర్మీత్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. ఆయనో సామాజిక కార్యకర్త అని పేర్కొన్నారు. గుర్మీత్ ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఈ విషయాన్ని సానుకూలంగా తీసుకుని.. తక్కువ శిక్ష విధించాలని కోరారు. ఆ తర్వాత ప్రాసిక్యూషన్ కూడా తన వాదనలు వినిపించింది. ఇలాంటి నేరాల విషయంలో ఎలాంటి వెనుకంజ వేయొద్దని కోరింది. భవిష్యత్తులో ఇలాంటి నేరాలు చేయకుండా ఉండాలంటే కఠిన శిక్ష విధించాలని ప్రాసిక్యూషన్ వాదించింది.

## పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయం

ముందుగా బొగ్గు శ్రీను మిత్రమండలి ఏర్పాటు చేసిన ఈ జన్మదినోత్సవాలలో పలువురు పేదవారికి పండ్లు, చీరలు, బియ్యం, రేషన్ తదితర సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి జన్మదినోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ తోటి వారికి సహాయ పడిన నాడే జీవితంలో ఉత్కృష్టమైన దశ కలుగుతుందని, సహాయాన్ని అందుకున్న వారు మనలను మనస్ఫూర్తిగా శతమానం భవతి అని ఆశీర్వదిస్తారని పేర్కొన్నారు. ఆ దీవనలే వ్యక్తికి ఆయుషును పెంచుతాయని ఆశీర్వదించారు. బొగ్గు శ్రీను ఇప్పటికే చేసిన సేవలు నిరుపమానమని స్తుతిస్తూ అతను చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. 37వ వార్డులో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేస్తూ తన స్వార్థంతో తన వార్డునే కాకుండా పక్క వార్డులలో కూడా చేపట్టిన కార్యక్రమాలు గురించి వివరించారు. ఇటువంటి వ్యక్తి జీవితంలో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఎన్టీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో అనంతరం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబబిరానికి సుమారు 275మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ డీజీపీ లీగల్ అడ్వైజర్ నాగరఘు, పలువురు మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే సరిపల్లి రంగరాజు సతీమణి విమలాదేవి, ఆయన కుమార్తె ఉమామహేశ్వరితోపాటు మాజీ కార్పొరేటర్లు జియ్యాన శ్రీధర్, కొల్లాబత్తుల వెంగళరావు, ఆర్‌ఆర్ గ్రాండ్ మేనేజింగ్ డైరెక్టర్, 37వ వార్డు వైకాపా అధ్యక్షుడు బొడ్డేటి నాగేశ్వరరావు (నాగు), అనూరాధ దంపతులు, నార్త్ ఏసీపీ లంక అర్జున్, కంచరపాలెం సీఐ చంద్రశేఖర మూర్తి, ఎస్ఐలు, మరియు బొగ్గు శ్రీను మిత్రమండలి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

## నంద్యాల టీడీపీదే....

పనితీరుకు రెఫరెండమని భావించడంతో ఇరు పార్టీల నేతలు జోరుగా ప్రచారం కొనసాగించారు. చివరి క్షణం వరకూ ఓటర్ల మద్దతు సంపాదించేందుకు ప్రయత్నించారు. ప్రతిపక్ష నేత జగన్ 13 రోజులపాటు నియోజకవర్గంలో ఉండి ప్రచారం నిర్వహించగా.. సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో రెండు రోజులు, నోటిఫికేషన్‌కు ముందు రెండు పర్యాయాలు నంద్యాలలో పర్యటించారు. చివరికి పోటీ.. అభ్యర్థుల మధ్య కాకుండా పార్టీ అధినేతల మధ్య అన్నట్లుగా సాగింది.

**తెదేపా సంబరాలు..**

నంద్యాలలో విజయంతో తెదేపా శ్రేణులు సంబరాల్లో మునిగితేలాయి. ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారని నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఇకనైనా విపక్ష నేత జగన్ తన తీరును మార్చుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో మంచి మెజార్టీ లభించడంతో.. తమ కృషికి ఫలితం లభించిందని ప్రచారం నిర్వహించిన నేతలు చెబుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి నంద్యాల ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. నంద్యాల ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి అపూర్వ విజయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు తెదేపాను ఆదరించారని.. ఈ విజయం అభివృద్ధికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

నంద్యాలలో జగన్ 15రోజుల పాటు బస చేసి ప్రలోభాలకు పాల్పడినా, ప్రజలు తిరస్కరించారు. ముఖ్యమంత్రిని నడిరోడ్డుపై కాల్చేయాలి, ఉరితీయాలి అని జగన్ చేసి వ్యాఖ్యలు ప్రజల్లో ఆందోళన కలిగించాయి. నంద్యాల ఫలితం రాబోయే ఎన్నికలకు నిదర్శనం. దీన్ని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం. సంక్షేమానికి పెద్దపీట వేస్తాం. అవినీతిని నిర్మూలించి.. ప్రజలు మెచ్చుకునే పాలన అందించి.. తెదేపా శాశ్వతంగా అధికారంలో ఉండేలా చేస్తాం అని చంద్రబాబు అన్నారు.

***ఆ నమ్మకంతోనే గెలిపించారు!***

***భూమా అఖిలప్రియ***

భూమా కుటుంబం, తెదేపా ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే నంద్యాల ప్రజలు తమకు పట్టం కట్టారని మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. తన సోదరుడు గెలుపుపై ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. తెదేపాకు డిపాజిట్ కూడా దక్కదంటూ వ్యాఖ్యలు చేసిన వారికి ఈ ఫలితం చెంపపెట్టు లాంటిది. మాపై నమ్మకంతో ఓట్లేసిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నంద్యాలను అభివృద్ధి చేస్తాం. మంత్రిగా బాధ్యతలు పెరగడంతో రాయలసీమ అభివృద్ధికి కృషి చేసి నా తండ్రి ఆశయాలను నెరవేరుస్తా అని అన్నారు.

**చంద్రబాబు మూడేళ్ల పాలనకు నిదర్శనం : మంత్రి సోమిరెడ్డి**

తెదేపా మూడేళ్ల పాలనకు నంద్యాల ఉపఎన్నిక ఫలితం నిదర్శనమని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మరోసారి స్పష్టమైందని విజయవాడలో పేర్కొన్నారు. విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు చంద్రబాబు పడుతున్న కష్టాన్ని నంద్యాల ప్రజలు గుర్తించారని అన్నారు. ఉపఎన్నికల ప్రచారంలో జగన్ వాడిన భాష ప్రజలకు ఆగ్రహం తెప్పించిందని.. అదే ఆగ్రహమే ఈ ఫలితాల్లో స్పష్టమవుతోందని అభిప్రాయపడ్డారు. వైకాపా సంస్కృతి ఎలాంటిదో రోజా లాంటి నేతలను చూస్తేనే తెలుస్తోందని ఎద్దేవా చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగన్.. రోజాతో అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేయిస్తే తెదేపాదే విజయమని అన్నారు. నంద్యాల ఫలితంతో కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధం ఉండదని.. అక్కడా భారీ మెజారీతో గెలవబోతున్నామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

**వచ్చే ఎన్నికల్లోగా వైకాపా ఖాళీ అవుతుంది : మంత్రి అచ్చెన్నాయుడు**

మూడేళ్ల తెదేపా ప్రభుత్వ పాలన మీద నమ్మకంతోనే నంద్యాల ప్రజలు తమ పార్టీకి పట్టం కట్టారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. విభజనతో రాష్ట్రం నష్టపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్నారని విజయవాడలో అన్నారు.

**ప్రజలకు ధన్యవాదాలు**

తెదేపాకు అఖండ విజయాన్ని అందించిన నంద్యాల ప్రజలకు మంత్రి నారాయణ ధన్యవాదాలు తెలిపారు. తెదేపా ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే ఈ విజయానికి కారణమన్నారు. ప్రతిపక్ష నేత ఇంటింటికీ తిరిగినా ప్రజలు తిరస్కరించారని.. జగన్ ఇప్పటికైనా తన ధోరణి మార్చుకుని హుందాగా వ్యవహరిస్తేనే ప్రజలు నమ్ముతారని సూచించారు. నేను మారను.. ఇలాగే ఉంటాను అని అంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ వైకాపా ఒక్క సీటు కూడా గెలవదని మంత్రి అన్నారు.

## బెదిరింపులకు పాల్పడ్డారు

అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అధికార పార్టీ నేతలు అంతగా బెదిరింపులకు పాల్పడినా ప్రజలు ధైర్యంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవడం అభినందనీయం అని జగన్ అన్నారు.

## కొత్త సీజేఐగా దీపక్ మిశ్రా ప్రమాణస్వీకారం

చేపట్టారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ దీపక్ మిశ్రాతో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణస్వీకారం చేయించారు. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది అయిన దీపక్ మిశ్రా 45వ సీజేఐగా 14 నెలల పాటు పదవిలో ఉంటారు. అక్టోబర్ 2018న పదవీ విరమణ చేస్తారు. 1977లో ఒడిశా హైకోర్టులో న్యాయవాదిగా కెరీర్ ప్రారంభించిన దీపక్ మిశ్రా 1977లో ఒడిశా హైకోర్టుకు అదనపు జడ్జిగా నియమితులయ్యారు. అనంతరం 1997లో మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. అదే ఏడాది చివర్లో శాశ్వత జడ్జి అయ్యారు. 2009లో పాట్నా హైకోర్టు చీఫ్ జస్టిస్ అయ్యారు. 2010లో ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టారు. మిశ్రా తన సుదీర్ఘ కెరీర్‌లో పలు కీలక తీర్పులు ఇచ్చారు. కాగా, ట్రిపుల్ తలాఖ్, ప్రైవసీ హక్కు వంటి తీర్పుల ద్వారా న్యాయవ్యవస్థ కీలక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రస్తుత తరుణంలో జస్టిస్ మిశ్రా సీజేఐగా బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# తెలంగాణ కళల సంరక్షణే లక్ష్యం

వర్గల్ : తెలంగాణ కళలను కాపాడటమే లక్ష్యంగా ప్రభుత్వం చేయూతనిస్తోందని నాచారంగుట్ట ఆలయ ఛైర్మన్ కొట్టాల యాదగిరి అన్నారు. నాచగిరి క్షేత్రంలో చిందు కళాకారులు ప్రదర్శించిన సతీతులసి యక్షగానం ప్రదర్శనను ఆయన తిలకించారు. అనంతరం మాట్లాడుతూ అంతరించిపోతున్న యక్షగానం కళను కాపాడటానికి సీఎం కేసీఆర్ చిందు కళాకారులకు చేయూతనిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే దేవాదాయశాఖ ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రాల్లో చిందు కళాకారులతో యక్షగానం ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నాచగిరిలో ఏర్పాటు చేశామన్నారు. నాచగిరి క్షేత్రంలో నిర్వహించిన యక్షగానం ప్రక్రియను పెద్దసంఖ్యలో భక్తులు తిలకించారు. కార్యక్రమంలో ఈవో సుధాకర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు రాములు, చంద్రారెడ్డి, పడిగెరాజు, యాదగిరి, విఠల్, పద్మావతి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

# సంస్కృతీ సంప్రదాయాలను ప్రోత్సహించాలి

### తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్



బోథ్(సొనాల) : ప్రభుత్వం ఆదివాసీ అస్థిత్వ మనుగడ కోసం సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ అన్నారు. సొనాల గ్రామంలో పార్డి రాయిసెంటర్ పరిధిలోని 46 గ్రామాల ఆదివాసీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆదివాసీల సంప్ర దాయలను ప్రతిబింబిచేలా ప్రదర్శించే గుస్సాడీ సంబరాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా మంత్రులు జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు ఇందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆశ్రమ, గురుకుల పాఠశాలల, కళాశాలలకు దసరా సెలవులకు బదులుగా ఆదివాసీలు అత్యంత పవిత్రంగా నెలరోజుల పాటు నిర్వహించే దీపావళి వేడుకలకు సెలవులను మంజూరు చేయాలన్నారు. సమావేశంలో పార్డి సార్‌మెడి తొడసం బండు, పట్నాపూర్ సార్‌మెడి ఆడెం భీంరావ్, వీటీడీఏ తొడసం లక్ష్మణ్, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు జుగ్నక్ విశ్వనాథ్, నాయకులు ఆత్రం శంకర్, సర్పంచి సోయం బాపురావ్, రాయిసిడం ఇస్రు, కుమ్రం మోతీరాం, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు మధుసూదన్ రెడ్డి

### – తమ్మినేని

ఖమ్మం : ప్రజానాట్య మండలి రాష్ట్ర సీనియర్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి అందరికీ ఆదర్శప్రాయుడని ఆయన మరణం సీపీఎంకు, కళారంగానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మంచికంటి భవన్‌లో మధుసూదన్‌రెడ్డి సంతాపసభ ఏ.ఎస్.కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ మధుసూదన్‌రెడ్డి గొప్ప కళాకారుడు మాత్రమే కాదని నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు కట్టుబడిన నిజమైన కమ్యూనిస్టు అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమంలో పనిచేసినప్పటి నుంచి మధు తనదైన శైలిలో అందరి అభిమానాన్ని చూరగొన్నాడని తెలిపారు. కళారంగంలోనూ చురుకైన పాత్ర పోషించాడని గుర్తు చేశారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఆశయ సాధనకు పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు వీ.వీ.అప్పారావు, ఎన్.రవిలు, ప్రజా నాట్యమండలి సీనియర్ నాయకుడు కె.దేవేంద్ర, నాయకులు రమేశ్, ఆనందాచారి, అరుణోదయ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల విస్తరణకు ముందస్తు చర్యలు

### ఆర్టీసీ స్థలంలో దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

వనపర్తి పట్టణం : ఎంతోకాలంగా వనపర్తి జిల్లా కేంద్రంలో రహదారులను విస్తరించాలని తీసుకున్న నిర్ణయంతో ఆర్టీసీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. విస్తరణ చేపడితే ఇబ్బందులు కలగరాదన్న లక్ష్యంతో ఉన్నతాధి కారులకు ఇక్కడి ప్రయాణ ప్రాంగణం ప్రధాన రహదారిని అనుసరించి దుకాణ సముదాయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేసి నివేదించారు. మూడేళ్ల కిందట పురపాలక సంఘంలో రహదారులు విస్తరించాలని, ఇందుకు రూ.204 కోట్లు అవసరమవుతాయని పురపాలక కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించింది. దానికి ప్రభుత్వమూ ఆమోదం తెలపడంతో విస్తరణ కావడం తప్పనిసరని భావించిన ఇక్కడి ఆర్టీసీ అధికారులు ప్రసుత్తం డిపోను అనుకొని ఉన్న తాత్కాలిక దుకాణాల స్థలాన్ని అనుసరించి దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదిం చారు. ఆర్టీసీ డిపోను అనుసరించి ఉన్న తాత్కాలిక దుకాణాలననుసరించి 30 ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో బిల్డ్ ఆపరేటర్ కన్‌స్ట్రక్షన్ విధానంలో నిర్మించాలని ప్రతిపాదనలు పంపారు. 12 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు వైశాల్యంలో దుకాణాలు నిర్మించాలని ప్రతిపాదించారు. బీవోసీ విధానంలో నిర్మించే దుకాణాలకు అద్దెదారులే సొంత డబ్బుతో దుకాణాలను నిర్మించాల్సి ఉంటుంది. 20 ఏళ్లపాటు దుకాణాలు నిర్మించిన వారే వాటిలో కొనసాగుతారు. ఇందుకోసం సుమారు 1500- 2వేల గజాల స్థలం అవసరమవుతుందని గుర్తించారు. ఈ ప్రతిపాదనలను ఇటీవల ఉన్నతాధికారులకు నివేదించారు.

# సార్వత్రిక డిగ్రీ, పీజీ ప్రవేశాల గడువు పొడిగింపు

ఖమ్మం : ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సులు(10+2) లేదా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అర్హత పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశాలు జరుగుతున్నాయని ఖమ్మం ప్రాంతీయ అధ్యయన కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్.ఏ.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరాలనుకునే వారు తమకు సమీపంలోని ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేయించాలి. దరఖాస్తుకు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు జత పరచి అధ్యయన కేంద్రంలో సమర్పించేందుకు సెప్టెంబరు 7వతేదీ వరకు గడువు పొడిగించినట్లు రమాదేవి తెలిపారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం, తృతీయ సంవత్సరంలో చేరటానికి గడువు సెప్టెంబరు 7వతేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీలో చేరటానికి కూడా సెప్టెంబరు 7వతేదీ వరకు గడువు పొడిగించినట్లు రమాదేవి తెలిపారు. అభ్యర్థులు తమ అడ్మిషన్ ఫీజులు గడువు లోగా ఏపీ లేదా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా మాత్రమే చెల్లించాలి. ఇతర వివరాలకు ఖమ్మంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

# సమానత్వ హక్కు అమలుతోనే అభివృద్ధి

ఖమ్మం : దేశంలో ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమానత్వం ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుం దని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. స్వాతంత్ర్య భారతంలో సామాజిక న్యాయం-సమగ్ర అభివృద్ధి అనే అంశంపై స్థానిక టీటీడీసీలో అంబేడ్కర్ ప్రజాసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో సామాజిక సమానత్వం సిద్ధించిన రోజున ప్రజాతంత్ర విలు వలు పరిరక్షించబడతాయన్నారు. మెజార్టీ ప్రజల కు వారి జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు వచ్చినపుడే మహనీయుల త్యాగాలు సాఫల్యం చెందుతాయన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు దాటినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల జీవితాలలో ఆశించిన మార్పు రాలేదన్నారు. గిరిజన ఆదివాసీ దళితులపై సామూహిక దాడులు, గ్రామ బహిష్కరణలు జరగటం భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఒక సవాల్‌గా మారిందన్నారు. కార్యక్రమంలో సామాజిక న్యాయవాది మేకల సుగుణారావు, పి.రాంమూర్తి, కత్తి నెహ్రూ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు సీహెచ్. కనకయ్య, విజయలక్ష్మి, లక్ష్మణరావు, ఎం.రవికుమార్, మోహన్‌రావు, పాలకుర్తి కృష్ణ, డా.కె.వి.కృష్ణారావు, షకీనా, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వసతిగృహాల్లో వసతులు కల్పిస్తాం

శివ్వంపేట: గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాల్లో ప్రభుత్వం సమస్యలకు పరిష్కారం చూపుతూ వసతులు కల్పిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కోటాజీ పేర్కొన్నారు. శివ్వంపేటలోని గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆరు వసతిగృహాలు, రెండు గురుకుల పాఠశాలలు ఉన్నాయని, వాటిల్లో నెలకొన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. వర్షాలు పుష్కలంగా కురవకపోవడం, వాతావరణం బాగా లేకపోవడం తదితర కారణాలతో వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల మంచాలపై పరుచుకునేందుకు అవసరమైన పరుపులు అందించామన్నారు. వసతిగృహానికి ప్రహరీ అసంపూర్తిగా ఉండటంతో స్థలం అక్రమణకు గురవుతోందని సంక్షేమాధికారి శేఖర్ ఆయన దృష్టికి తీసుకెళ్లగా నిధుల మంజూరుకు కృషి చేస్తానని వివరించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు.

# ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

జైనథ్ : తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ నాయకులతో కలిసి మండలకేంద్రంలో పాదయాత్ర నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అవ లంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి సీపీఎం పోరాడుతుందని పేర్కొన్నారు.

# 2.59 లక్షల మందికి బతుకమ్మ చీరలు



మెదక్ : బతుకమ్మ.. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాన్ని ప్రతిబింబించే పండుగ. వూరూ, వాడా, పల్లె, పట్నం అనే తేడా లేకుండా మగువలంతా పూలను పూజించే మహత్తర వేడుక. ప్రకృతిని ఆరాధించే అద్భుత ఘట్టం. అంబరాన్నంటే ఆ సంబురాలు ఈ సారి మహిళలకు మరింత ఆనందం పంచనున్నాయి. కులమతాలకు అతీతంగా బతుకమ్మ సంబురాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి మగువకు చేనేత చీరలు పంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఆహారభద్రత కార్డు ఉండి.. 1-8-2017 నాటికి 18 ఏళ్లు నిండిన మహిళలకు ఉచితంగా అందజేయనున్నారు. జిల్లాలోని ఇరవై మండలాల్లో 18 ఏళ్లు పైబడిన 2,59,000 మంది లబ్ధిదారులను పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు. వేడుకలకు ముందు చౌక ధర దుకాణాల ద్వారా పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల అధికారి రేవతి మాట్లాడుతూ లబ్ధిదారుల వద్ద ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.

### ఓడీఎఫ్‌లో నిరసన..

# భూనిర్వాసితుల ధర్నా

సంగారెడ్డి : రక్షణ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను అనుమతించొద్దని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఓడీఎఫ్‌లో ఏఐడీఈఎఫ్ (ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో పరిశ్రమ ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర రక్షణ మంత్రి అరుణ్‌జైట్లీ ఇక్కడికిపర్యటనకు రాగా.. గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. స్థానికులకు, భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయుధ కర్మాగార ఉద్యోగులకు ఇస్తున్న సదుపాయాల్లో కోత విధించవద్దని కోరారు. 2004 తర్వాత నియామకమైన ఉద్యోగులకు పింఛను సదుపాయం కల్పించాలన్నారు. పరిశ్రమలో కేంద్ర మంత్రి పర్యటన ఉంటే ప్రొటోకాల్ ప్రకారం తమకు ఆహ్వానం ఉండాలని, అది పాటించకపోవటం ఎంతవరకు సమంజసమని ఎద్దుమైలారం సర్పంచి దశరథ్ ప్రశ్నించారు. ఏఐడీఈఎఫ్ నాయకుల నిరసనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం పరిశ్రమ శాఖ అధ్యక్షులు అర్జున్, నాయకులు మల్లేశం పాల్గొన్నారు.

పరిశ్రమ ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన మాకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో ఓడీఎఫ్‌లో ధర్నా చేశారు. 1982లో భూ సేకరణ సమయంలో ఒక పట్టాకు ఒక ఉద్యోగం అని హామీ ఇచ్చారని, దీని ప్రకారం 672 మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా మొదటి విడతలో 511 మాత్రమే ఇచ్చారని తెలిపారు. మిగతా 161 మందికి వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన వారి పేరిట కొందరు తప్పుడు పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమకు వచ్చిన అరుణ్‌జైట్లీని కలిసి తమ గోడు చెప్పుకొందామంటే అందుకు అనుమతించక పోవటాన్ని తప్పుపట్టారు. కార్యక్రమంలో ఎద్దుమైలారం, సింగపురం, క్యాసారం, చెర్యాలకు చెందిన నిర్వాసితుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థలను బలోపేతం చేయాలి

ఖమ్మం : రాజ్యాంగం ద్వారా సంక్రమించిన విధులు, అధికారాలు బదలాయించి అవసరమైన నిధులు స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి కోరారు. హక్కుల సాధన కోసం ఖమ్మంలోని కెమిస్ట్, డ్రగ్గిస్ట్ భవన్‌లో నిర్వహించిన సర్పంచుల సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత అందించాలని అన్నారు. ఇప్పటికే సర్పంచుల చెక్‌పవర్ రద్దు చేసిన ప్రభుత్వం కార్యదర్శితో కలసి జాయింట్ చెక్‌పవర్ కల్పించటం సర్పంచులను అవమానించటమే అవుతుందన్నారు. వెంటనే కార్యదర్శితో జాయింట్ చెక్‌పవర్ రద్దు చేసి కేవలం సర్పంచుకు మాత్రమే చెక్‌పవర్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సర్పంచుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని లేకుంటే సర్పంచుల సమరభేరి హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ ఎదుట మోగుతుందన్నారు. 73,74 రాజ్యాంగ సవరణ ద్వారా సంక్రమించిన 29 రకాల అధికారాలను పంచాయతీలకు వెంటనే బదలాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు రావాల్సిన వృత్తి పన్ను, మినరల్ సెస్, స్టాంప్ డ్యూటీ, సుమారు రూ.15వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని, సర్పంచుల విధులకు ఆటంకం కలిగిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర పీఆర్ ఛాంబర్ గౌరవాధ్యక్షుడు పుసులూరి నరేందర్, ఉపాధ్యక్షుడు అశోక్‌రావు, తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మెంటపల్లి పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల సంక్షేమం కోసం పాటుపడుతున్నాం

### మంత్రి జోగురామన్న



శాంతినగర్ : భారతరత్న డా.బి.ఆర్.అంబేడ్కర్, అన్నాభావుసాఠే వంటి మహోన్నతుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం దళితుల సంక్షేమాన్ని కాంక్షించి పనిచేస్తోందని మంత్రి జోగురామన్న అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో నిర్వహించిన అన్నాభావుసాఠే 97వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అన్నాభావుసాఠే, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో నడుస్తున్న తెలంగాణ ప్రభుత్వం దళితులను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా పాలన చేస్తోందన్నారు. దళితులు పంటపొలాలను సాగుచేసుకునేలా మూడెకరాల భూమిని అందించడంలో మన జిల్లా ముందుండటం సంతోషకరమన్నారు. పరిశ్రమలు పెట్టాలనుకునే దళితులకు బ్యాంకు ద్వారా రుణాలు అందిస్తామన్నారు. స్థలాలు లేని వారికి ప్రభుత్వం తరఫున ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. మాంగ్ కులస్తుల కోరిక మేరకు ముఖ్యమంత్రికి విన్నవించి ట్యాంక్‌బండ్‌పై అన్నాభావు సాఠే విగ్రహం ఏర్పాటు చేయించేందుకు, వచ్చే ఏడాదికల్లా జయంతి వేడుకల్ని అధికారికంగా నిర్వహించేందుకు కృషిచేస్తానన్నారు. ఎమ్మెల్యే నిధులు అందించి జిల్లాకేంద్రంలో అన్నాభావుసాఠే భవన నిర్మాణానికి తోడ్పాటునందిస్తానన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రొఫెసర్ వంశీతిలక్, మాంగ్ కుల సంఘ నాయకులు మాట్లాడుతూ పేదప్రజలకు కడుపునిండా బోజనం లభించినపుడే స్వాతంత్ర్యం సిద్ధించించినట్లు భావించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పేదప్రజల జీవితాల్లో వెలుగునింపేలా పథకాలు ప్రవేశపెట్టి అందిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రంగినేని మనీష, ఐసీడీఎస్ నిర్వాహకురాలు కస్తాల ప్రేమల, గ్రంథాలయ ఛైర్మన్ రౌతు మనోహర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అరె రాజన్న, మావల సర్పంచి ఉష్కం రఘుపతి, సామాజిక కార్యకర్త బండారి దేవన్న, హైదరాబాద్ నుంచి వచ్చిన నాయకులు శ్రీనివాస్, చీలీ జనార్ధన్, త్రిమూర్తి, సాంబశివరావు, జిల్లా నాయకులు నాందేవ్ కాంబ్లే, గణేష్ మెకానె, రవి వాఘ్మారే, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

అన్నాభావుసాఠే జయంతి వేడుకల సందర్భంగా ఆ సంఘం జిల్లా పట్టణ కమిటీ, మాతాంగ్, దళిత సంఘాల నాయకులు జిల్లాకేంద్రంలో అన్నాభావుసాఠే కూడలిలో ఆయన చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలేసి జోహార్లు సమర్పించారు. దళితులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని సూచించారు. అనంతరం అక్కడ్నుంచి బ్యాండుమేళాలతో వూరేగింపుగా టీఎన్జీఓ భవనానికి చేరుకున్నారు.

# కార్మికుల పక్షపాతి కేసీఆర్

### టీఆర్ఎస్‌కేవీని బలోపేతం చేయాలి

భువనగిరి : ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల పక్షపాతి అని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో టీఆర్ఎస్‌కేవీ జిల్లా నాయకులు మందుల వెంకటయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా ముఖ్య కార్యకర్తల సదస్సులో వారు మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల సేవలను గుర్తించి నిరంతరం కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే ఆటో కార్మికులు చెల్లించాల్సిన రూ.74 కోట్ల పన్నులను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమాను రూ.2 నుంచి రూ.6 లక్షలకు పెంచిందన్నారు. దశల వారీగా అందరి సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలన్నారు. టీఆర్ఎస్‌కేవీని బలోపేతం చేసేందుకు అందరికీ అందుబాటులో ఉంటూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా పని చేయాలని కార్మిక నాయకులకు సూచించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికులలో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అడుగక ముందే కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి అందరికీ న్యాయం జరిగేలా సీఎం కేసీఆర్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో పుర అధ్యక్షురాలు సుర్వి లావణ్య, గ్రంథాలయ ఛైర్మన్ అమరేందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పరమేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ కంకల కిష్టయ్య, టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర నాయకులు నారాయణ, సిలివేరు ప్రభాకర్, అంగన్‌వాడీ రాష్ట్ర అధ్యక్షులు నల్ల బారతి, టీఆర్ఎస్‌కేవీ నాయకులు మారయ్య, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### ఒప్పందమే పరిష్కారం

చైనాతో డోక్లామ్ వివాదం రగులుతున్న నేపథ్యంలో నేపాల్ ప్రధాని షేర్ బహదుర్ దేవుబా భారత పర్యటనకు రావడం, ఒప్పందాలు కుదుర్చుకోవడం హర్షణీయమైన పరిణామం. ఊహించిన రీతిలోనే దేవుబాకు ఘనస్వాగతం లభించింది. ప్రధాని నరేంద్ర మోదీ, దేవుబా మధ్య సమగ్ర చర్చలు సాగడంతో పాటు రెండు దేశాల మధ్య ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. సందర్భానుసారం ప్రాంతీయ సంబంధాలు, వ్యూహాత్మక అంశాలు చర్చకు వచ్చాయి. దేవుబా ఉన్నతస్థాయి వ్యాపార బృందంతో తరలివచ్చారు కనుక వాణిజ్యం ప్రధానాంశమైంది. సరిహద్దు మీదుగా సాగే రెండు విద్యుత్ లైన్స్‌ను ఇరువురు ప్రధానులు ఉమ్మడిగా ప్రారంభించారు. నేపాల్ సర్వతోముఖా భివృద్ధికి భారత్ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ ఉమ్మడి పత్రికా సమావేశంలో హామీ ఇచ్చారు. నేపాల్ భారత వ్యతిరేక కార్యకలాపాలకు వేదిక కాబోదని నేపాల్ ప్రధాని దేవుబా హామీ ఇచ్చారు. నేపాల్ అభివృద్ధిలో భాగస్వామి కావడం భారత్ అదృష్టమనీ, ఇంధనం, జలవనరులు తదితర రంగాలలో ప్రాజెక్టుల కోసం రెండు దేశా లు ఉమ్మడి కృషి సాగిస్తున్నాయని ప్రధాని మోదీ వివరించారు. నేపాల్‌లో భారత్ చేపట్టే జలవిద్యుత్ కేంద్రానికి (అరుణ్ 3) భూమిని సమకూర్చినట్టు వెల్లడించిన దేవుబా, ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రావాలని ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఇటీవలి వరకు రెండు దేశాల మధ్య ఉద్రిక్త సంబంధాలే ఉన్నాయి. హటాత్తుగా ఈ ఇచ్చికోవడం, పుచ్చుకోవడం సాగడం వెనుక డోక్లామ్ వివాద నేపథ్యం ఉన్నది. నేపాల్‌తో సత్సంబంధాల విషయంలో భారత్ అప్రమత్తమైందని తెలుస్తూనే ఉన్నది. డోక్లామ్ వివాదం తలెత్తగానే భూటాన్ యథావిధిగా భారత్ అనుకూల వైఖరి తీసుకున్నది. కానీ నేపాల్ ఇందుకు భిన్నంగా తాము తటస్థంగా ఉంటామని ప్రకటించింది. నేపాల్ విదేశాం గ మంత్రి కృష్ణ బహదూర్ మహరా తమ తటస్థ వైఖరిని పదిహేను రోజుల కిందట స్పష్టం చేశారు. (భారత్- చైనా) సరిహద్దు వివాదంలో నేపాల్‌ను ఈ వైపు లేదా ఆ వైపు లాగడం జరుగదు. భారత్, చైనా శాంతియుతంగా దౌత్య మార్గాల ద్వారా వివాదాన్ని పరిష్కరించుకోవాలని నేపాల్ కోరుకుంటున్నది అని ఆయన వివరించారు. డోక్లామ్ వివాదం తలెత్తిన తరువాత ఢిల్లీలోని చైనా రాయబారి స్వయంగా నేపాల్ రాయబార కార్యాలయానికి వెళ్ళి మంతనాలు జరిపారు. నేపాల్ తటస్థ దేశం శాంతియుత పరిష్కారాన్ని కోరుతున్నది అంటూ ఢిల్లీలోని నేపాల్ రాయబారి దీప్ కుమార్ భారత్ అనుకూల వైఖరి తీసుకోవడం లేదని స్పష్టంగానే చెప్పారు. డోక్లామ్ గొడవ సాగుతుండగానే చైనా ఉప ప్రధాని వాంగ్ యాంగ్ పాకిస్థాన్‌లో స్వాతం త్ర్య వేడుకలకు హాజరై అక్కడి నుంచి నేపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా నేపాల్‌తో ఇంధనంతో పాటు అనేక రంగాలలో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వచ్చే అక్టోబరులో చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ నేపాల్ పర్యటిస్తున్నారు. నేపాల్‌ను తటస్థం గా మార్చడంలో చైనా విజయవంతమైందనేది స్పష్టం. డోక్లామ్ ప్రాంతంలో భారత్‌పై ఎదురు సవాళ్లు విసురుతున్న చైనా తాము కశ్మీర్‌లో, కాలాపానీలో ప్రవేశిస్తే ఎట్లా ఉంటుందని హెచ్చరించిం ది. డోక్లామ్ చైనా, భారత్, భూటాన్ దేశాల కూడలిలో ఉన్నది. ఇదే విధంగా కశ్మీర్ భారత్, చైనా, పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న ప్రాంతం. కాలాపానీ భారత్, చైనా, నేపాల్ కూడలి. చైనా బెదిరింపుల నేపథ్యంలో భారత్‌కు నేపాల్‌తో ఉద్రిక్తతలను సడలించుకోవలసిన తక్షణ అవసరం ఏర్పడ్డది. ఈ నేపథ్యంలోనే దేవుబా భారత్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడ్డది. నేపాల్‌లో ఎవరు అధికారం చేపట్టినా తమ మొదటి పర్యటనగా భారత్‌ను సందర్శిస్తారు. దేవుబా కూడా మొదటి విదేశీ పర్యటనగా ఢిల్లీలో అడుగు పెట్టారు. కానీ జూన్‌లో అధికారం చేపట్టిన దేవుబా ఢిల్లీ రావడానికి ముందే, నేపాల్‌తో ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేసుకోవడంలో చైనా వేగంగా పావులు కదిపింది. భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తత చైనాకు అనుకూలంగా కలిసివచ్చింది. నేపాల్‌లో మధేసి ఆందోళన మూలంగా 2015 సెప్టెంబరు నుంచి 2016 ఫిబ్ర వరి వరకు ఆ దేశానికి భారత్ నుంచి రవాణా సదుపాయాలు నిలిచిపోయాయి. మందులు, వంటగ్యాస్ మొదలుకొని అనేక వస్తువులకు కొరత ఏర్పడటంతో భారత్ వ్యతిరేకత ప్రబలింది. పథకం ప్రకారం భారత్ తమపై ఒత్తిడి తెస్తున్నదనే అభిప్రాయం నేపాలీలకు ఏర్పడ్డది. దీనిని చైనా అనుకూలంగా మలుచుకున్నది. పెద్ద ఎత్తున నిత్యావసర వస్తువులు సరఫరా చేసింది. రవాణా కోసం దాదాపు ముప్ఫై మార్గాలను తెరిచింది. గత ఏడాది నేపాల్‌కు రుణ సహాయం అందించిన దేశాలలో చైనా భారత్‌ను అధిగమించింది. వన్ బెల్ట్ వన్ రోడ్ సమావేశాన్ని భార త్ బహిష్కరిస్తే, నేపాల్ మాత్రం హాజరైంది. చైనా ఒక్క నేపాల్‌తోనే కాదు, భారత్ పొరుగు దేశాలన్నిటితోనూ సాన్నిహిత్యం పెంచుకుంటూ తన ప్రాబల్యాన్ని విస్తరించుకుంటున్నది.

# కట్టిగె ముహూర్తం పూర్తి



ఉడుపి : పర్యాయ ఏర్పాట్లలో భాగంగా కట్టిగె ముహూర్తాన్ని నిర్వహించారు. వచ్చే ఏడాది ఆరం భంలో నిర్వహించే కార్యక్రమంలో పలిమారు మఠాధిపతి విద్యాదీశ తీర్థ పర్యాయ బాధ్యతల్ని చేపట్టనున్న విషయం తెలి సిందే.

ఇందుకు సంబంధించి ఏర్పాట్లు వూపందు కున్నాయి. జనవరి 18న పర్యాయ ఉత్సవాన్ని నిర్వహించ నున్నారు. ఈ నేపథ్యంలో పలిమారు మఠంలో కార్య కలాపాలు వూపందుకున్నాయి.

ఇప్పటికే బాళె, అక్కి ముహూర్తాల్ని నిర్వహించారు. త్వరలోనే భత్త ముహూర్తాన్ని నిర్వహిస్తారు. దీంతో పర్యాయ ఏర్పాట్లు పూర్తవుతాయి.

# శశికళ ఇచ్చిన పదవి నుంచి తప్పుకోండి

## పళనిస్వామికి కొత్త నిర్వాహకులు సవాల్



సేలం : ధైర్యం ఉంటే శశికళ ఇచ్చిన ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలని ఎడప్పాడి పళనిస్వామికు సవాల్ విసిరారు దినకరన్ నియమించిన కొత్త నిర్వాహకులు. సేలం జిల్లా పురపాలక పట్టణ జిల్లా కార్యదర్శి పదవిలో ఉన్న ఎడప్పాడి పళనిస్వామిని తొలగించి ఆ స్థానంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ ఈ. వెంకటా చలపతిని, దక్షిణ జిల్లా కార్యదర్శి వెంకటాచలపతిని తొలగించి మాజీ ఎమ్మెల్యే ఎస్‌కే సెల్వంను కొత్త నిర్వా హకులుగా దినకరన్ నియమించారు. ఈ సందర్భంగా కొత్త నిర్వాహకులు విలేకరులతో మాట్లాడుతూ పన్నీరు సెల్వం వర్గానికి చెందిన తాము ఆయన తప్పుడు నిర్ణ యాలతో విభేదించి వైదొలగినట్లు తెలిపారు. ఆదాయం కోసం పళనిస్వామితో చేతులు కలిపి ద్రోహం తలపెట్టారని ఆరోపించారు. అన్నాడీఎంకేలో నిర్వాహ కులను తొలగించడం, నియమించే అధికారం ప్రధాన కార్యదర్శికి ఉందన్నారు. ఆ అధికారాన్ని శశికళ ఉప కార్యదర్శి దినకరన్‌కు అప్పగించిందని తెలిపారు. ఆమె ఇచ్చిన పదవిని వదిలేసి కార్యకర్తల అభీష్టం మేరకు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని సవాల్ విసిరారు.

# స్వచ్ఛతకు ప్రాధాన్యతనిద్దాం

ఖరగ్‌పూర్ : స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇద్దాం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామన్న నినాదంతో ఖరగ్‌పూర్ రైల్వే వర్క్‌షాప్‌లో స్వచ్ఛ జాగృతి అభిజాన్ ర్యాలీ జరిగింది. ఇందులో సివిల్ డిఫెన్స్ ఉద్యోగులతో పాటు సీడబ్ల్యుఎమ్ ఎ.కె.గుప్తా, డబ్ల్యుపీఓ ఎస్.కె.మహాపాత్ర, సీడీఐ రంజన్ కుమార్ పాల్గొని వర్క్‌షాప్ అంతా ర్యాలీగా తిరిగారు.

స్వచ్ఛతే మన లక్ష్యమన్న ప్రతిజ్ఞతో ఈ కార్యక్రమం ముగిసింది.

# వర్గీకరణతో పేదలకు నష్టం: సిద్ధు



బెంగళూరు : కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాల రిజర్వేషన్‌ను ఏబీసీడీలుగా వర్గీకరించేందుకు ప్రయత్నిస్తే సామాజిక న్యాయానికి పెద్ద ప్రమాదం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఇక్కడ ప్యాలెస్ మైదానంలో కర్ణాటక కురుబర సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు ఉన్న 27శాతం రిజర్వేషన్‌ను వర్గీకరించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సామాజిక న్యాయం పేరుతో కేంద్రం అన్యాయం చేసేందుకు కుట్ర పన్నుతోందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఇప్పటి వరకు కులం, ఇతర సామాజిక పరిస్థితులు, విద్య తదితర అంశాల ఆధారంగా సమీక్షలు జరగలేదన్నారు. పరిస్థితి ఇలా ఉంటే వెనుకబడినవర్గాల రిజర్వేషన్‌ను ఏ ఆధారంతో వర్గీకరిస్తారని ప్రశ్నించారు. కేంద్ర వెనుక బడినవర్గాల కమిషన్‌కు రాజ్యాంగపరమైన గుర్తింపు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటే కొందరు వ్యతిరేకిస్తున్నారని ఇటీవల రాష్ట్రానికి వచ్చిన భాజపా అధ్యక్షుడు అమిత్ షా చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కులాల్ని గుర్తించే అధికారం రాష్ట్ర వెనుకబడినవర్గాల కమిషన్లకు ఉండా లన్నది తమ ఉద్దేశమన్నారు. అధికారాన్ని వెనక్కి తీసుకోకూడదన్నది తమ బలమైన డిమాండ్ అన్నారు. రాష్ట్రంలోని చిన్న కులాలపై కేంద్రం వద్ద ఎలాంటి సమాచారం లేదన్నారు. అలాంటి కులాల్ని వెనుకబడినవర్గాల జాబి తాలో చేర్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని నొక్కి చెప్పారు. బ్రిటిష్ పాలకులు వచ్చిన తరువాత దిగువ కులాలవారు చదువుకు దగ్గరయ్యారని అన్నారు. తాను ప్రభుత్వ ఉద్యోగం కోసం చదువుకోలేదని, ఒకదశలో చదువు ఎందుకు? మేకలు, గొర్రెలు కాసుకుంటే బాగుంటుందన్న తలంపు వచ్చి, చదువుకు స్వస్తి చెప్పాలనుకున్నట్లు తన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. న్యాయవాది అయి పేదల తరపున కేసులు వాదించాలనే ఉద్దేశంతో న్యాయకోర్సు పూర్తి చేసినట్లు సిద్ధరామయ్య తెలిపారు. రాజకీయాల్లోకి రావాలని తాను కలలో కూడా వూహించలేదన్నారు. బ్రిటిష్ పాలకులు పెట్టిన బిక్షవల్ల దళిత, వెనుకబడిన వర్గాల వారికి అక్షరానికి ఉన్న ప్రాధాన్యం తెలియవచ్చిందన్నారు. కాగినెలె మఠాధిపతి ఈశ్వరానందపురి స్వామి మాట్లాడుతూ విమర్శల్ని పట్టించుకోకుండా ముందుకు సాగాలని సూచించారు.

లింగాయతను స్వతంత్ర ధర్మంగా గుర్తించాలని ఆ వర్గం నుంచి డిమాండ్ వస్తే సిద్ధరామయ్య ఆ సమాజంలో చీలిక తెస్తున్నారని కొందరు పనిగట్టుకుని ఆరోపిస్తున్నారని, ఇలాంటి వాటిని లెక్క చేయవద్దన్నారు. సిద్ధరామయ్య కష్టాల నుంచి పైకి వచ్చారని, పేదల కష్టాలు ఆయనకు బాగా తెలుసన్నారు. పేదల కోసం ఆయన అనేక పథకాలు చేపట్టారని గుర్తు చేశారు.

ఈ సందర్భంగా పదోతరగతి, పీయూసీలలో అధిక మార్కులు సాధించిన 1500 మంది విద్యార్థులకు తలా రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హెచ్.ఎం.రేవణ్ణ, శాసనసభ్యులు వర్తూరు ప్రకాష్, ఎంటీబీ నాగరాజు, భైరతి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### స్వార్థపరులు ప్రజలకు మంచి చేయరు

స్వార్థం అనేది మనిషికి ఉండే దుర్గుణాలలో ఒకటి. స్వార్థం వీడితే మనిషి మనస్సు దైవత్వంతో నిండిపోతుంది. అయితే నేడు అందరిలోనూ స్వార్థం ఎక్కువైపోయింది. దేశాన్ని నడిపించే నాయకులు, అధికారులు స్వార్థంతో దేశప్రగతికి తూట్లు పొడుస్తున్నారు. నాయకులు, అధికారులు స్వార్థచింతన మానితే మనదేశం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుంది. తమ వారికి మాత్రమే మేలు జరిగే పథకాలను ప్రవేశపెడుతున్నారు. తమకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారు. ఆ పార్టీ ఈ పార్టీ అవి ఏమీ లేదు. అంతా దొంగలే. ఖరీదయిన ఖద్దరు దొంగలు కాబట్టి మనం నాయకులను ఎన్నుకొనేటప్పుడు మంచి వ్యక్తిత్వం, సేవా దృక్పథం ఉన్నవారిని ఎన్నుకోవాలి. అప్పుడు మనకు మేలు కలుగుతుంది. రాజకీయ నాయకులు తమ విధులను నిజాయితీగా నిర్వర్తిస్తే అధికారులు కూడా సక్రమంగా పనిచేస్తారు. కానీ నేటి నాయకులు ఎన్నికలలో విపరీతంగా ధనాన్ని ఖర్చు చేసి అధికారంలోకి వచ్చాక దానికి పదిరెట్లు ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. ప్రజలు కూడా నోట్లకి ఓట్లను అమ్ముకుంటున్నారు. స్వార్థపరులగు రాజకీయ నాయకుల గురించి ఓ శతకకవి ఇలా వ్రాశాడు.

'క్రూరమృగము నడవి గూల్చ వేటయగును
క్రూరు నూర గూల్చ నేరమగును
స్వార్థపరులు చేయు చట్టము లిట్లుండు
త్రిపురనేని వాణి తెలుగుబాణి'

...కవితా రచన
వడ్లమాని అన్నపూర్ణ

# పంచాంగం

మాసం : భాద్రపద; తిథి: అష్టమి రా.2.11; అనూరాధ రా.11.43; తె.వ.5.54ల

మంగళవారం 29-08-2017

**మేషం** : క్రయ విక్రయ రంగాలలోని వారికి నూతన ఉత్సాహం కానవస్తుంది. కాంట్రాక్టర్లకు అధికమైన ఒత్తిడి తప్పదు. వాహన విషయంలో సంతృప్తి కానవస్తుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలకు సంబంధించి ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. **వృషభం** : మీ కళత్ర మొండి వైఖరి, కుటుంబీకుల పట్టుదల మనశ్శాంతిని దూరం చేస్తాయి. ఇంటర్వ్యూలలో శ్రద్ధ వహించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలి. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం విదేశాలు వెళ్లేందుకు మార్గం సుగమవుతుంది. ఇతరుల అంతరంగిక విషయాలలో తలదూర్చకండి. **మిథునం** : రావలసిన బకాయిల విషయంలో మెళుకువ అవసరం. సోదరీ, సోదరులతో ఏకీభావం కుదరదు. ఐరన్, సిమెంట్, కలప రంగాలలో వారికి చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిదని గమనించండి. లీజు, ఏజెన్సీ, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్నేహ పరిచయాలు విస్తరిస్తాయి. **కర్కాటకం** : ఆహార వ్యవహారాలలో మెళుకువ వహించండి. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. స్త్రీలకు పనివారలతో ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. మీ యత్నాలకు సన్నిహితుల ప్రోత్సాహం, సహకారం అందిస్తారు. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చు కుంటారు. **సింహం** : మీ ఆదాయానికి మించి ఖర్చులు అధికమవుతాయి. మీ సంతానం చదువుల్లో బాగా రాణిస్తారు. నిర్మాణ పథకాలలో పురోభివృద్ధి కానవస్తుంది. ఉద్యోగస్తులు తోటివారి కారణంగా అధికారులతో మాటపడవలసి వస్తుంది. షేర్ మార్కెట్ రంగాల వారికి సామాన్యం. పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారస్తులుకు లాభదాయకం. **కన్య** : లిటిగేషన్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. ధనం సమయానికి అందుట వలన సంతృప్తి కానవస్తుంది. బంధు మిత్రులతో సంబంధ బాంధవ్యాలు బాగుగా ఉంటాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం చేసే యత్నాలు అనుకూలిస్తాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి. **తుల** : కందులు, ఎండుమిర్చి, స్టాకిస్టులు, వ్యాపారస్తులు సంతృప్తి కానవస్తుంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. రచయితలకు, పత్రికా రంగంలో వారికి కీర్తి, గౌరవాలు పెరుగుతాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. రాజకీయాల్లో వారికి తెలివితేటలకు మంచి గుర్తింపు లభిస్తుంది. **వృశ్చికం** : కుటుంబీకుల నుంచి సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది. ఫ్యాన్సీ, సుగంధ ద్రవ్య, రసాయన వ్యాపారస్తులకు లాభదాయకం. ఉపాధ్యాయులు ఒత్తిడి సమస్యలకు లోనవుతారు. ఎదుటివారు మీకు సమఉజ్జీలేనని గ్రహించండి. గత అనుభవాలు జ్ఞప్తికి రాగలవు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు అనుకూలి స్తాయి. **ధనుస్సు** : స్త్రీలకు నూతన వ్యక్తుల పరిచయం ఎంతో ఇబ్బంది కలిగిస్తుంది. మార్కెటింగ్ రంగాల్లో వారికి, పత్రికా, ప్రైవేటు సంస్థల్లో వారికి మార్పులు అనుకూలిస్తాయి. ఊహించని ఖర్చులు వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు. విద్యార్థులకు అతి ఉత్సాహం వల్ల సమస్యలు తలెత్తుతాయి. **మకరం** : ఉపాధ్యాయులకు ఒక సమాచారం ఆసక్తి కలిగిస్తుంది. స్త్రీలు ప్రముఖుల సిఫార్సుతో దైవ దర్శనాలను త్వరగా ముగించుకుంటారు. నూతన అగ్రిమెంట్లు వాయిదా వెయ్యండి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. నిరుద్యోగులు భవిష్యత్ గురించి పథకాలు వేసిన సత్ఫలితాలు పొందుతారు. ఖర్చులు అధికమవుతాయి. **కుంభం** : ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.రావలసిన డబ్బు చేతికి అందడం వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఉండదు. స్త్రీలు తేలికగా మోస పోయే ఆస్కారం కలదు. **మీనం** : ఆర్థిక విషయాల్లో ఒకడుగు ముందుకు వేస్తారు. కాంట్రాక్టర్లకు అధికారులతో అవగాహన కుదరదు. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు ఒడిదుడుకులు తప్పవు. కొంత మంది మీ సహాయం పొంది మిమ్మల్ని తక్కువ అంచనా వేయటం వల్ల ఆందోళనకకు గురవుతారు.



# శుభ ఫలితాలనిచ్చే సుబ్రమణ్యస్వామి

## సంకీర్తన

ఒకే శరీరంలో ఆరుముఖాలు పన్నెండు చేతులు గల కార్తికేయునికి సహాయకులుగా పార్వతిదేవి నూపురం నుంచి తొమ్మిది మంది వీరులు జనించారు. వీరబాహు, వీరకేసరి, వీర మహేంద్ర, వీర మహేశ్వర, వీర పురంధర, వీర రాక్షస, వీర మార్తాండ, వీరాంతక, వీర ధీర అని వారిని పిల్వడం జరుగుతోంది. విష్ణు ఆదేశం మేరకు శివుడు ఆ బాలుని నుంచి ప్రణవోపదేశం పొందాడు. ఆ కారణంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి, శివగురు, స్వామినాథ, దేశిక అనే పేర్లు వచ్చాయి. కుమారస్వామి ఇంద్రుని కుమార్తె అయిన దేవయానిని, శివమూర్తి కుమార్తె వల్లీదేవిని వివాహమాడాడు. అలాగే ఆ స్వామి నెమలిన తన వాహనంగానూ, కోడి పుంజును తన ధ్వజంగానూ చేసుకున్నాడు. ఆ కారణంగా స్వామి శిఖివాహనుడు, కుక్కుట ధ్వజుడయ్యాడు. సుబ్రహ్మణ్యేశ్వ రుడి ధ్వజమందు కోడి పుంజు ఉంటుంది. కో అనే ధ్వని ప్రణవమును సూచిస్తుంది. జ్ఞాన భానూదయము నకు ధ్వని సంకేతం. అలాగే స్వామి వాహనమైన నెమలి పురివిప్పి నర్తించునపుడు ఓంకార రూపంలో ఉంటుంది. ఆ కారణంగా స్వామిని ప్రణవ స్వరూపుడిగా చెబుతారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సేవించే సమయంలో ఉరగేశ్వ రాయనమః మహోర ణాయనమః అని కీర్తించడం జరుగుతోంది. వల్లీదేవి స్వరూపంలో ఉన్నదని, స్వామి కూడా సర్ప రూపంలో ఉంటాడని పురాణాల ద్వారా అవగతమవుతోంది.తెలుగు రాష్ట్రాలలో సుబ్రహ్మణ్య షష్టి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపు కుంటారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఈ పర్వదినం రోజున స్వామికి ఘనంగా పూజలు నిర్వహిస్తారు. సుబ్రహ్మణ్య షష్టిరోజున వేకువజామునే నిద్రలేచి తలంటు స్నానం చేస్తారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరునికి సమర్పించడానికి చిలీ (నువ్వులు, బెల్లంతో కలగలిపినది) తయారుచేసి, కొబ్బరికాయలు, అరటిపళ్ళు, పాలు, కోడిగుడ్లతో బయలుదేరుతారు. సుబ్రహ్మణ్యే శ్వరుడు సర్పాకారుడు కావడంవల్ల సమీప ప్రాంతాలలో ఉన్న పుట్టలకు చేరుకుని పుట్టను శుద్ధిచేసి, పసుపు, కుంకుమ బొట్లు, అందమైన ముగ్గులతో అలంకరిస్తారు. అనంతరం, పాలు కోడి గుడ్లను పుట్టలలో వేసి, ప్రసాదాలను, కొబ్బరి కాయలను నివేదిస్తారు. స్వామిని భక్తితో పూజిస్తూ, భజన గీతాలు, భక్తి పాటలతో కీర్తిస్తారు. అనంతరం పుట్ట మన్నును తమ చెవులకు రాసుకుంటారు. అలా చేయడంవల్ల తమకు చెవికి సంబంధించిన వ్యాధులు దరిచేరవని నమ్ముతారు. అలాగే మహిళా భక్తులు, పుట్టలో పాలుపోసి, పుట్ట చుట్టూ భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేస్తారు. సంతాన ప్రాప్తికోసం స్వామిని మనసావాచా ఆరాధిస్తారు. పిల్లలు, స్వామికి ప్రణామాలు అర్పించి మందుగుండు సామాను కాలుస్తారు. అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే సుబ్రహ్మణ్య ఆరాధన శక్తిని, ఐశ్వర్య మహద్భాగ్యాలను కల్గిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఆ సుబ్రహ్మణ్యే శ్వరుని అపార కృపా రసామృతం అందరిమీదా వెల్లివిరియాలని మనసావాచా అందరూ పూజిస్తారు.

**కుజదోష నివారణకు** : పార్వతీపరమేశ్వరుల మంగళాˆరమె%న ప్రేమకు, అనుగ్రహానికి ఐక్యరూపం సుబ్రహ్మణ్య స్వామి. స్వామి అనే నాయధేయం కేవలం సుబ్రహ్మణ్యానికి సొంతం. దేవసేనాధిపతిగా, సకల దేవగణాల చేత పూజలందుకునే దె%వం కుమారస్వామి అని పురాణాలు చెబుతున్నాయి. అలాంటి షణ్ముఖుని అనుగ్రహం పొందగలిగితే స్కంద పంచమి, కుమార షష్టి రోజున స్వామని పూజించాలి. కుమారస్వామని పూజిస్తే గౌరీశంకరుల కటాక్షం మనకు లభించినట్టేనని పురాణాలు చెబుతున్నాయి. శివపార్వతుల తనయుడైన కుమారస్వామి గంగాదేవి గర్భంలో పెరిగాడు. ఆమె భరించ లేకపోవడంతో, ఆ శిశువు రెల్లుపొదల్లో జారిపడింది. ఆ శిశువును కృత్తికా దేవతలు ఆరుగురు స్తన్యమిచ్చి పెంచారు.

జారిపడినందున ఆ శిశువునకు స్కందుడని, రెల్లుగడ్డిలో ఆవిర్భవించడంతో శరవణుడని, కృత్తికా దేవతలు పెంచడంతో కార్తికేయుడని కుమారస్వామి అని పిలుస్తారు. ఇక సుబ్రహ్మణ్యునికి ఉన్న ఆరుముఖాలకు ప్రత్యేకతలు ఉన్నాయి. ఆరు ముఖాల స్వామిగా ఆనందదాయ కుడిగా స్వామి కరుణా మయుడిగా భక్తులచే నీరాజనాలు అందు కుంటున్నాడు. అందుచేత ఆషాడ మాస శుక్లపక్ష పంచమి, షష్టి పుణ్యదినాల్లో భక్తులు స్వామిని విశేషంగా సేవిస్తారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days విజయభాను క్లాసిఫైడ్స్ సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# ఆధునిక సాగుపై అవగాహన కల్పించాలి

సుజాతనగర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం రైతులపై కేసులు పెట్టి, వారికి బేడీలను వేసే బదులు వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక దిగుబడులను పొందడం, పంటల సాగులో మెళకువలు నేర్పితే బాగుంటుందని పార్లమెంటు సభ్యురాలు రేణుకాచౌదరి హితవు పలికారు. అడవులు, కాలుష్యం, సైన్స్ అండ్ టెక్నాలజీపై సమీక్షలో భాగంగా జిల్లాలో పర్యటిస్తోన్న 14మంది ఎంపీ సభ్యులతో కూడిన స్టాండింగ్ కమిటీ సుజాతనగర్‌లోని మన్నేపల్లి రవి అనే రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించింది. తొలుత మండల పరిధిలోని నాయకులగూడెం వద్ద రేణుక బృందానికి స్థానికులు గిరిజన సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. స్వయంగా ట్రాక్టరు నడుపుతూ సుజాతనగర్ వరకు వచ్చిన కమిటీ ఛైర్మన్ రేణుక అనంతరం జరిగిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఉపయోగపడేలా పంటల సాగులో మెళకువలపై ఆధునిక సాంకేతికతను వినియోగించి పలు సూచనలు చేయడం ద్వారా వారికి నష్టాలను నివారించే వీలుందన్నారు.

ఏ పంట ఎప్పుడు, ఎక్కడ వేయాలి, నీటి వనరులను ఎలా వినియోగించుకోవాలి, వర్షపాత సూచనలు వంటివి సందర్భానుకూలంగా రైతులకందించడం ద్వారా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు మేలు చేకూర్చాలని సూచించారు. భద్రాచలం పేపర్ బోర్డు పరిశ్రమకు చెందిన వ్యర్థాలు గోదావరిలో కలిపి నీటిని కలుషితం చేస్తున్నారని ఫిర్యాదులందినట్లు తెలిపారు.

భద్రాద్రి హెవీ వాటర్ ప్లాంటు నిర్మించుకొని ఓ వైపు నీటిని శుద్ధి చేస్తుంటే మరోవైపు కలుషితం చేసి ఆ నీటిని వినియోగానికి పనికిరాకుండా చేయడం సరికాదన్నారు. వీటిని పరిశీలిస్తామన్నారు. సిఫార్సుల విషయంలో ప్రజాప్రయోజనాలే ముఖ్యంగా భావిస్తామన్నారు. బోడకాకర సాగును రేణుక పరిశీలించారు. బోడ కాకర వంటి పంటల సాగుతో రైతులు భారీగా లాభపడొచ్చని ఇక్కడి పరిస్థితులు చూస్తే తెలుస్తోందన్నారు. అక్టోబరులో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వారం రోజులపాటు వసతితో కూడిన ఉచిత శిక్షణ అందజేస్తామని రైతు మన్నేపల్లి రవి పేర్కొన్నారు. స్టాండింగ్ కమిటీ ఎంపీలు సుఖ్‌రాంసింగ్ యాదవ్, రంగసాయి రామకృష్ణ, నాగేంద్ర సింగ్, విక్రమ్ ఉసెండి, నానాపటోలె, శివాజీ పాటిల్, సీపీ నారాయణన్, ప్రసన్న ఆచార్య, మహమ్మద్ బషీర్, బాలసుబ్రమణ్యన్, వందనాచావన్, మిశ్రా, పంకజ్ చౌదరి, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎడవల్లి కృష్ణ, స్థానిక నాయకులు తాళ్లూరి శ్రీను, గురజాల సీతయ్య, బొడ్డు బాలు, నవతన్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతులన్నీ ఏకం కావాలి

## మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి




సంగారెడ్డి : దివ్యాంగులకు విద్య, ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, దివ్యాంగుల పింఛన్ల పెంపు కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమించేందుకు ప్రశ్నించే గొంతులన్నీ ఏకం కావాలని సీపీఎంకు చెందిన మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. వికలాంగుల జాతీయ హక్కుల రాష్ట్ర మహాసభలు పోతిరెడ్డిపల్లిలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అందరికీ విద్య, వైద్యం, పౌష్టికాహారం, స్వచ్ఛమైన నీరు ఉంటేనే వైకల్య జననాలు ఉండవని చెప్పారు. 98 శాతం దివ్యాంగులు పేద కుటుంబాల నుంచే వస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10.50 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, వీరంతా ఏకమై వారి సమస్యలను పరిష్కరించడానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికి 40 శాతం జనాభాకు అక్షరజ్ఞానం లేదని చెప్పారు. గత పాలకుల విధానాల వల్లే దేశంలో పేదరికం ఇంకా ఉందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆత్మహత్యలు మరింత పెరిగాయని తెలిపారు. ఎన్‌పీఆర్‌డీ ఆలిండియా ఉపాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ దివ్యాంగులను అవమానించేలా మాట్లాడినా, దాడులు, లైంగిక వేదింపులకు గురి చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ నిధుల్లో 5 శాతం దివ్యాంగులకు ఖర్చు చేయాలని కోరారు. సంక్షేమ పథకాల్లోని ఆర్థిక సహాయాన్ని పెంచాలని కోరారు. దివ్యాంగుల సమస్యలపై సీపీఎం పోరాటం చేస్తుందని తెలిపారు.

రాజ్యసభలో సీతారాం ఏచూరి మాత్రమే దివ్యాంగుల సమస్యలపై మాట్లాడారని గుర్తుచేశారు. సభలో రాష్ట్ర కార్యదర్శి అడివయ్య, ఐద్వా రాష్ట్ర నాయకు రాలు జ్యోతి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

# 35వేల మంది మహిళలతో బతుకమ్మ వేడుక

తుంగతుర్తి : సెప్టెంబరు 27న బతుకమ్మ వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో 35 వేల మంది మహిళలతో సామూహిక బతుకమ్మ వేడుకను నిర్వహించేందుకు తెరాస, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో గొప్ప కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడె రాజీవ్ సాగర్ అన్నారు. తుంగతుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ వేడుకలకు రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి వేయి మంది మహిళలను, హైదరాబాద్ నుంచి నాలుగు వేల మంది మహిళలను సమీకరిస్తున్నట్లు తెలిపారు. ఇంద్ర ధనస్సులోని రంగల మాదిరిగా వలయాకారంలో స్టేడియం చుట్టూ బతుకమ్మ ఆట ఆడటం జరుగుతుందన్నారు. అదేవిధంగా జాగృతి ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ నియామకం కోసం ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని ఉపేందర్‌రావు, ఎనగందుల మల్లేష్ నేత, భూతం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి




పెబ్బేరు : సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మండల భాజపా కార్యవర్గ సమావేశం మండలపార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ శెట్టి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. తెరాస అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోతే తాము అన్ని గ్రామాల్లోని బూత్‌స్థాయిల్లో జాతీయ జెండ ఎగర వేస్తామని స్పష్టం చేశారు. తెరాస ప్రభుత్వం మాటలతో కాలం గడపుతుందని.. చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. వచ్చే సాధారణ ఎన్నికల నాటికి భాజపాని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, సహదేవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, వేమారెడ్డి, మహేందర్‌గౌడ్, కరుణాకర్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, రాముడు, బుచ్చన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీపై కేంద్రం మొండి వైఖరి: రేణుకా

ఖమ్మం : జీఎస్టీ (వస్తువులు, సేవల పన్ను) అమలు చేయటంలో కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, దీంతో చిన్నతరహా పరిశ్రమలు దేశంలో మూత పడే పరిస్థితికి చేరుకుంటున్నాయని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి విమర్శించారు. జీఎస్టీ 28 నుంచి 5 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నాచౌక్‌లో గ్రానైట్ పరిశ్రమల యజమానులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఎంపీ రేణుకా చౌదరి గ్రానైట్ పరిశ్రమల యజమానుల నిరాహార దీక్షల శిబిరానికి చేరుకుని వారికి మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతరహాకు చెందిన గ్రానైట్ పరిశ్రమపై విధించిన జీఎస్టీ 28 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని గతంలోనే కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి విన్నవించామని, అయినా స్పందించటంలేదన్నారు. పన్ను తగ్గించే వరకూ కేంద్ర ప్రభుత్వంతో పోరాడుతామన్నారు. గ్రానైట్ పరిశ్రమల యజమానులతో కలసి తానూ ఆందోళనలో పాల్గొంటానని ప్రకటించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఎడవల్లి కృష్ణ, దిరిశాల భద్రయ్య, రాధాకిషోర్ తదితరులున్నారు.

రెండో రోజు నిరాహార దీక్షలో పారా నాగేశ్వరరావు, వేముల రవికుమార్, బాలాజీ ప్రసాద్, పాటిబండ్ల యుగంధర్, తమ్మినేని వెంకట్రావు, జొన్నలగడ్డ రవికుమార్, నజీర్, అశోక్ కొఠారి, కనకమేడల సత్యనారాయణ పాల్గొన్నారు. వారి దీక్షలకు మద్దతుగా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిరసన ప్రదర్శన జరిగింది. సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వర్లు, నున్నా నాగేశ్వరరావు, అఫ్రోజ్ సమీనా తదితరులు ప్రదర్శనగా దీక్షా శిబిరానికి చేరుకున్నారు. దీక్షలో పాల్గొన్నవారికి సంఘీభావం ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా ఖండించారు.

తెరాస నాయకులు బుడన్‌బేగ్, పోట్ల నాగేశ్వరరావు, తిరుమలరావు, సీపీఐ నాయకులు బాగం హేమంతరావు, ఎండీ సలాం, తెదేపా నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, ఎన్డీ నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే నాయకులు ఆకుతోట ఆదినారాయణ, ఇస్మాయిల్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. దీక్షలో పాల్గొన్న వారి ఆరోగ్య పరిస్థితిని ప్రైవేటు వైద్యులు పరీక్షించారు.

# కల్లు గీత వృత్తి రక్షణకు పోరాటం

చేగుంట : కల్లుగీత వృత్తి రక్షణకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గౌడజన హక్కుల పోరాటసమితి అధ్యక్షులు పాపని కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. చేగుంట ర.భ. అతిథి గృహంలో జిల్లా గౌడజన హక్కుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత వృత్తి రక్షణకు గౌడకులస్తులు పార్టీలకు అతీతంగా పోరాటం చేయాలన్నారు. ఐక్య ఉద్యమం ద్వారానే దేనినైనా సాధించుకునేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. త్వరలోనే హైదరాబాద్‌ను దిగ్బంధం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ట్యాంక్ బండ్‌పై వెంటనే సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జనగామ జిల్లాకు పాపన్నగౌడ్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. గీత కార్పొరేషన్‌కు రూ. 5 వేల కోట్లను వెంటనే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరవేణి నర్సాగౌడ్, రాష్ట్ర నాయకులు కొండాపురం బాలరాజుగౌడ్, జిల్లా అధ్యక్షుడు బుచ్చన్నగారి కిషన్‌గౌడ్, బాలాగౌడ్, లక్ష్మన్‌గౌడ్, పోశాగౌడ్, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రిమిలేయర్ విధానం రద్దు చేయాలి

యాదగిరిగుట్ట : ఓబీసీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం స్వాగతిస్తున్నప్పటికీ, క్రిమిలేయర్ విధానం మాత్రం ఒప్పుకునేది లేదని, దానిని రద్దు చేయాలని ఓబీసీ సమాఖ్య కేంద్ర కమిటీ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. గుట్టలో స్థానిక బీసీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. క్రిమిలేయర్ విధానం వల్ల ఓబీసీలను చీల్చడమేనన్నారు. 1993 నుంచి మండల కమీషన్ సిఫారసు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వాలు, ఓబీసీ వర్గీకరణ కోసం న్యాయబద్ధమైన కమీషన్ వేసి దేశంలోని 3,500 బీసీ కులాలకు న్యాయం చేయాలన్నారు. ఇంత వరకు చట్టసభల్లో అడుగుపెట్టని కులాలకు వచ్చే ఎన్నికల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర కార్యాలయాల్లో ఓబీసీలకు అవకాశం కల్పించలేదనేది వాస్తమని, ఆయా కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేపట్టి ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ల ద్వారా అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాదూరి అచ్చయ్య, గుర్రం వసంత, సుదగాని వెంకటేశ్, సాంబేష్, వెంకటరత్నం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తల వేతనాలు పెంపు అమలుకు చర్యలు: బుడాన్‌బేగ్

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం ఆశాకార్యకర్తలకు పెంచిన వేతనాలను అమలు చేసేందుకు ఇప్పటికే చర్యలకు ఉపక్రమించిందని ఐడీసీ ఛైర్మన్, తెరాస జిల్లా అధ్యక్షుడు బుడాన్‌బేగ్ అన్నారు. నగరంలోని రామకృష్ణ ఫంక్షన్‌హాలులో ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల ఆశాకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాల పెంపు జీవో విడుదల కాలేదని, అది అమలు కాదని కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని, అయితే ప్రభుత్వం అమలు చేసేందుకు ప్రయత్నాలు పారంభించిందన్నారు. అవసరమైతే పార్టీ తరుపున ప్రభుత్వం దృష్టి విషయాన్ని తీసుకెళ్లి అమలు చేసేందుకు కృషిచేస్తామన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ బి.కరుణ, తెరాస నగర అధ్యక్షుడు, కార్పొరేటర్ కె.మురళి, నాయకులు ప్రమీలరాణి, రమణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ రైతును సన్మానించిన కేంద్ర మంత్రి

జైనథ్ : మండలంలోని భోరజ్ గ్రామానికి చెందిన ఆదర్శ రైతు పొద్దుటూరి రాంరెడ్డిని కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని నారాయణగూడలో ఉన్న కేశవ మెమోరియల్ పాఠశాలలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బలరాముడి జయంతోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉత్తమ రైతులు, ఉత్తమ అధికారులు, ఉత్తమ పత్రికా విలేఖరులను సన్మానించారు.

# ఆర్టీసీని బలోపేతం చేయాలి



ఎదులాపురం : ఆర్టీసీని బలోపేతం చేయడంతో పాటు సంస్థలో జరుగుతున్న శ్రమదోపిడి అరికడుతూ, సేవలను విస్తరించడానికి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడానికి ఆదివారం సుందరయ్య భవన్‌లో జరిగిన ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆ సంఘం రాష్ట్ర కేంద్ర కమిటీ కోషాధికారి ఏవీ రావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, సంస్థ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. ప్రజల అవసరాలు తీరేలా బస్సుల సంఖ్యను పెంచి ప్రైవేటు అద్దె బస్సును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఉద్యోగవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి ఆర్టీసీని దూరం చేసే ఎంవీ చట్టం-2017ని రద్దు చేయాలని, డీజిల్ ధరలపై పన్నును ప్రభుత్వం తగ్గించాలన్నారు. గుర్తింపు సంఘం ఉదాసీన వైఖరి వల్ల కార్మికులపై పనిభారం పెరిగిపోయి మానసిక ఒత్తిడికి గురవుతున్నారని విమర్శించారు. ఏప్రిల్ నుంచి వర్తింపచేయాల్సిన వేతన సవరణ ఇప్పటి వరకు చేయకపోవటం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీని బలోపేతం చేయడానికి ప్రజలు సూచనలు స్వీకరించడానికి సెప్టెంబర్ 1 నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. దీన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రాంచందర్, నిర్మల్, బైంసా, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ డిపోల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివబాబు, భీంరావు, సత్యం, పోచ్చన్న, పూషన్న, రమేష్, చందర్, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారమే రిజర్వేషన్లు ఉండాలి

## మెస్రం ఆనంద్, ప్రచార కార్యకర్త జై ఆదివాసీ యువశక్తి (జైస్)



ఇంద్రవెల్లి : భారత రాజ్యాంగం 1950లో క్లాస్ 1 ఆర్టికల్ 342లో 9 ఆదివాసీ తెగలను గుర్తించి ఎస్టీలు గుర్తించిందని, ఆ నిబంధనల ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు రిజర్వేషన్ కల్పించాలని జైస్ ( జై ఆదివాసీ యువశక్తి ) తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యకర్త మెస్రం ఆనంద్ డిమాండ్ చేశారు. గిరిజన అమర వీరుల స్మారక స్థూపం వద్ద మిషన్ 2018లో కోటి మంది ఆదివాసీలతో చలో దిల్లీ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన స్మారకస్తూపం వద్ద మాట్లాడుతూ.. జల్, జంగల్, జమీన్ కోసం ఆదివాసీలు రక్తం ధారపోసిన నెల ఇంద్రవెల్లి నుంచి చలో దిల్లీ కార్యక్రమానికి శ్రీకారం చేస్తున్నామని అన్నారు. భారతరాజ్యాంగం ప్రకారంగా తెలంగాణ ప్రాంతంలో షెడ్యూల్డు జిల్లాలుగా ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలు గుర్తింపు పొందాయని గుర్తు చేశారు. ఆర్టికల్ 244(1) 5వ, 6వ షెడ్యూల్డు లను పకడ్బందీగా అమలు చేయడం తోపాటు పార్లమెంట్ లో ఆదివాసీ అనే పదాన్ని రాజ్యాంగంలో పొందుపర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అధికారంలో ఉన్న తెరాస ప్రభుత్వం నియమించిన చెల్లప్ప కమిషన్ సిఫార్సులను వెంటనే రద్దు చేయాలన్నారు. అంతరించి పోతున్న ఆదివాసీ తెగలను సంరక్షించుటకు ప్రత్యేక చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. గోండి భాషకు ప్రాముఖ్యమిచ్చి భాషా పరిరక్షణకు చట్టాలను తీసుకురావాలని అన్నారు. ఆయనతో పాటు జైస్ ప్రచారకర్త ఆడ హన్మంత్‌రావు, అమరవీరుల ఆశయ సాధన సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, ఇంద్రవెల్లి ఆదిమ గిరిజన సంఘాల జేఏసీ అధ్యక్షుడు కొట్నాక్ భారిక్‌రావు, సలహాదారుడు కుడ్మేత గోద్రు, కొరెంగా సీతారాం, మానిక్‌రావు, పెందూర్ భీంరావు, గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సరైన వసతుల్లేక రైతులు నష్టపోతున్నారు

## మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్




పాలమూరు : మనది వ్యవసాయ ఆధారిత దేశమైనా రైతులకు సరైన మౌలిక వసతులు లేక తీవ్రంగా నష్ట పోతున్నారని మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళా భవన్‌లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మూడ్రోజుల రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఉండటం లేదని, తరవాత మాత్రం మార్కెట్‌లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని పేర్కొన్నారు. ధరలేని పరిస్థితుల్లో పంటలను నిల్వ చేయడానికి గిడ్డంగులను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులపై జరిపిన సర్వేలో 40శాతం మంది వ్యవసాయంపై విముఖతతో ఉన్నారని తెలిపారు. వ్యాపారం, ఇతర అనుబంధ రంగాల వైపు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. చిన్న కమతాలతో పంటలు పండక, పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు వ్యవసాయంపై ఆసక్తి చూపడం లేదని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం ద్వారా ఇక్కడ రైతులు పండించిన పంటలకు ధర లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని, నిరుద్యోగం పెరిగిపోతుందని అన్నారు. వ్యవసాయంపై వేసిన ఎంఎస్ స్వామినాధన్ కమిషన్, జయంతి ఘోష్ కమిషన్ సిఫారస్సులను అమలు చేయడం లేదన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ వ్యవస్థ నుంచి వ్యవసాయాన్ని కాపాడాలన్నారు. రైతులకు మేలు రకమైన వంగడాలు, అధునాతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని కోరారు. పండించిన పంటలకు మంచి ధరను అందించి, బ్యాంకర్లు, ప్రభుత్వాలు రైతులకు రుణాలు అందించాలన్నారు. శిక్షణ తరగతులకు తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి అధ్యక్షత వహించగా.. రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, నాయకులు జబ్బార్, ఉమా మహేశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి, జంగారెడ్డి, లక్ష్మి, రామిరెడ్డి, శ్రీనివాస్, చంద్రకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దైవారాధనలో రాగి పాత్ర

ఈ రోజుల్లో కూడా పూజాది కార్యక్రమాలకి వెండి, బంగారు పాత్రలు ఉపయోగించే వారు లేకపోలేదు. అయితే ఒకప్పటికంటే ఇప్పుడు అలాంటివారి సంఖ్య తగ్గిందనే చెప్పాలి. ఇక మధ్యతరగతి వారు కూడా ఇత్తడి - రాగి పాత్రలను వాడటం చాలావరకు తగ్గించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎవరి ఇంట్లో చూసినా స్టీలు పాత్రలే దర్శనమిస్తున్నాయి. పూజకి ఉపయోగించే అన్ని రకాల పాత్రలు నేడు స్టీలులోనే కనిపిస్తున్నాయి. నగిషీ కారణంగా స్టీలు ... ఇనుము అనే భావన కలగనీయదు. ఈ కారణంగానే దీని వాడకం అంతకంతకూ పెరుగుతూపోతోంది.అయితే ఇటు ఆరోగ్యపరంగాను ... అటు ఆధ్యాత్మిక పరంగాను స్టీలు పాత్రలను వాడకూడదని శాస్త్రం చెబుతోంది.



**పూజలకు స్టీల్ పనికిరాదు:**

స్తోమత వుంటే వెండి - బంగారం, లేదంటే ఇత్తడి - రాగి పాత్రలను వాడటమే అన్ని విధాలా మంచిదని చెబుతోంది. స్టీలు ( ఇనుము) శని సంబంధమైన లోహం కనుక, దానికి బదులుగా ఇతరలోహాలతో చేసిన పాత్రలను మాత్రమే పూజకు వాడాలనీ, అప్పుడే ఎలాంటి దోషాలు లేని పరిపూర్ణమైన ఫలితాలను పొందవచ్చని స్పష్టం చేస్తోంది.

**రాగితో ఆరోగ్యం బోలెడు:**

గతంలో రాగి చెంబు, రాగి బిందె, రాగి గ్లాసు, రాగి ప్లేటు ఇలా ఎక్కువగా రాగి వస్తువులనే వాడే వారు. కాని నేడు ఫ్యాషన్ ఎక్కువయ్యి ప్లాస్టిక్ వచ్చిపడింది. దాంతో రాగి పాత్రల వాడకం బాగా తగ్గిపోయింది. నీళ్ళు తాగాలంటే ప్లాస్టిక్ బాటిల్స్, లంచ్ బాక్సులు కూడా ప్లాస్టికే. నేటి ఇళ్ళు మొత్తం ప్లాస్టిక్ సామానుల మయమైపోయాయి. అయితే రాగి పాత్రలు వాడడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

రాగిలో యాంటి బ్యాక్టీరియల్ నేచర్ ఉంటుంది. రాగితో చేసిన పాత్రలలో సూక్ష్మ క్రిములు చేరే అవకాశం ఉండదు. కాబట్టి ఇందులో నిల్వచేసే పదార్థాలు చెడిపోయే అవకాశాలు చాలా తక్కువ.

మనకి వచ్చే చాలా రోగాలకి నీటి కాలుష్యం ముఖ్యమైన కారణం. రాగి పాత్రలలో నీళ్ళు ఉంచితే అందులో క్రిములు చేరే అవకాశం చాలా అరుదు. అందుకే పాత రోజుల్లో రాగి బిందెలు వాడేవారు.

చెవులు కుట్టినప్పుడు కూడా చిన్న పిల్లలకి కొన్ని చోట్ల మొదటిసారి రాగి తీగలు చుడతారు. ఎందుకంటే పుండు పడకుండా ఉండటానికి. రాగికి వున్న ఆంటి బ్యాక్టీరియల్ లక్షణం పిల్లలకు ఆ ప్రమాదం రాకుండా చేస్తుంది.

గతంలో నీళ్ళు వేడి చేసుకోవడానికి రాగితో చేసిన బాయిలర్లు వాడే వాళ్ళు. ఇందులో వేడి చేసిన నీరు వాడడం వల్ల చర్మ సంబంధిత రోగాలు కూడా తగ్గేవని రుజువు చెయ్యబడ్డాయి.

రాగి చెంబులో రాత్రి నీరు వుంచి పగలు నిద్ర లేవగానే తాగితే చాలా చాలా మంచిది. అలా తాగితే కడు పులో వున్న చెడు అంతా మూత్రం ద్వారా బయటకి వచ్చేస్తుందట. ఈ అలవాటు వల్ల గ్యాస్, కిడ్నీ, లివర్ సమస్యలు కూడా తగ్గిపోతాయి.

బ్రిటిష్‌కి చెందిన ఒక యూనివర్సిటీ వాళ్ళు కూడా రాగిపాత్రలలో ఉంచిన నీటిపై పరిశోధన జరిపి పైన పేర్కొన్న విషయాలు నిజమని నిరూపించారు.

**పరగడుపున రాగి పాత్రలో నీళ్లు:**

రాత్రి రాగి చెంబులో మంచి నీళ్ళు వుంచి పరగడుపున తాగితే హాయిగా జీవించవచ్చు. రాత్రి నిద్ర పోయేముందు అర లీటర్ నుండి లీటర్ ఉండే రాగి చెంబు నిండా మంచినీళ్ళు పోసి మంచం పక్కనే పెట్టుకోవాలి ఉదయం నిద్ర లేచి లేవగానే రెండు సార్లు పుక్కిలించి ఊసి ఆ రాగి చెంబులోని నీళ్లు తాగాలి . దీనివల్ల 15 నిమిషాల నుండి అర గంటలోపు సుఖ విరోచనం అవుతుంది. గ్యాస్, కడుపుబ్బరము, కడుపులో మంట, మలబద్ధకం, తేపులు, మొదలైన బాధలన్నీ ఈ అలవాటుతో ఎటువంటి ఔషదాలు వాడే పని లేకుండా పూర్తిగా తగ్గిపోతాయి. మలబద్ధకం అనేది అన్ని వ్యాధుల్ని కలిగించడానికి మూలకారణం కాబట్టి ఈ అలవాటు తో మలబద్ధకం నివారించుకుంటే హాయిగా జీవించవచ్చు.


**ఘనమైన రాగి చరిత్ర:**

ఇక రాగి చెంబులో నీళ్ళే ఎందుకు తాగాలి వేరేవి ఉన్నాయి కదా అని కొందరికి సందేహం రావచ్చు . రాగి గురించి వరాహ పురాణంలో వివరంగా ఉంది ఈ రాగి ఏడువేల యుగాల క్రితమే విష్ణు మాయ కారణంగా పుట్టింది .




# యోగాతో అనునిత్యం ఆరోగ్యం

తరుచుగా అనారోగ్యాలకు గురయ్యే మహిళలు నిత్యం యోగా చేయడం మూలంగా అరోగ్యం కుదుటపడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. వివిధ రకాల యోగాసనాల మూలంగా శరీరం, వమనసు రెండు కూడా ప్రశాంతంగా ఉంటాయని వారంటున్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఎంతోగానో ఉపయోగపడుతుందని, మహిళలు ఇంటి పట్టునే ఉండి ప్రతిరోజు ఈ యోగాను చేయడం మూలంగా అన్ని రకాల సమస్యలు పరిష్కారమవుతాయని వారంటున్నారు. యోగాలో భాగంగా ప్రాణాయామం గురించి ఈ వారం తెలుసుకుందాం.



ప్రాణం + ఆయామం = ప్రాణాయమం. ప్రాణమంటే జీవన శక్తి. ఆయామం అంటే విస్తరింపచేయుట లేక నియంత్రించి ఉంచుట అని అర్థం. పతంజలి మహర్షి ప్రసాదించిన యోగ సూత్ర ప్రకారం శ్వాస, ప్రశ్వాసల్ని నియంత్రించి ఉంచడమే ప్రాణాయామం అని నిర్ధారించడం జరిగింది. లోనికి పీల్చే గాలిని శ్వాస అని, బయటికి వదిలే గాలిని ప్రశ్వాస అని అంటారు. శ్వాస ప్రశ్వాసల్ని నియంత్రించడం, క్రమబద్దం చేయడం ద్వారా అంతర్గత సూక్ష్మప్రాణాన్ని కూడా అదుపులో ఉంచవచ్చు.

**నియమబద్ధంగా**

నాడీమండలం, రక్త ప్రసార ధమనులు, జీర్ణకోశం, మూత్రకోశం మొదలుగా గల వాటన్నిటి యందు ప్రాణం సంచరిస్తూ ఉంటుంది. ప్రాణాయామం వల్ల వాటన్నింటికి శక్తి, రక్షణ కల్పిస్తాయి. కనుకనే ప్రాణాయామేన యుక్తేన సర్వరోగ క్షయ భవేత్'' అంటే ప్రాణాయామం నియమబద్ధంగా ఆచరిస్తే సర్వరోగాలు హరించిపోతాయి అను సూత్రం ప్రచలితం అయింది. ప్రాణానికి ప్రాణ, అపాన, సమాన, ఉదాన, వ్యానమను 5 రూపాలు ఉన్నాయి. ప్రాణానికి స్థానం హృద యం. అపానానికి స్థానం గుదం. సమానానికి స్థానం నాభి. ఉదనానికి స్థానం కంఠం. వ్యానానికి స్థానం శరీరమంతా. శ్వాసక్రియకు ప్రాణం, విసర్జన క్రియకు అపానం, పాచన క్రియకు సమానం, కంఠశక్తికి ఉదానం, రక్తపసార క్రియకు వ్యానం తోడ్పడుతాయి.

**రేచకం-పూరకం**

శ్వాసను బయటకు వదిలే క్రియను రేచకం అని, లోపలకి పీల్చే క్రియను పూరకం అని, లోపల గాలిని ఉంచడాన్ని అంతర్ పూరకం అని, తిరిగి బయ టకి వదిలి ఆపి ఉంచడాన్ని బాహ్యాకుంభకం అని అంటారు. ఈ క్రియలు ప్రాణాయామానికి సాధనాలు. మెడికల్ సైన్స్ ప్రకారం రెండు ముక్కు రంధ్రాల ప్రయోజనం ఒక్కటే. కాని యోగులు ఈ రెండింటికి మధ్య గల భేదం గ్రహించారు. వారి పరిశోధన ప్రకారం కుడి ముక్కు రంధ్రాన్నుంచి నడిచే గాలి కొద్దిగా ఉష్ణం కలిగిస్తుంది. అందువల్ల దీన్ని వారు సూర్య నాడి లేక సూర్య స్వరం అని అన్నారు. అట్లే ఎడమ ముక్కు రంధ్రం ప్రభావం వల్ల చల్లని దనం అందువల్ల దాన్ని చంద్రనాడి లేక చంద్రస్వరం అని అన్నారు. ఈ రెండిటికి మధ్య సమన్వయం సాదించుటకు యోగ శాస్త్రంలో ప్రాధాన్యం ఇవ్వబడింది. హ అను అక్షరం చంద్రుడికి, ట అను అక్షరం సూర్యు డికి గుర్తుగా నిర్ధారించారు. అందువల్ల హఠ యోగం వెలువడింది. హఠ యోగ మంటే చంద్ర సూర్య నాడులకు సంబంధించిన విజ్ఞానం అన్నమాట. హఠం అనగాబలవంతం అనికాదు. ప్రాణాయామ విజ్ఞానమంతా చంద్ర, సూర్య స్వరాలకు సంబంధించినదే.


***ప్రాణాయామం వల్ల కలిగే ప్రయోజనాలు...***

1. ఊపిరితిత్తులు బాగా పనిచేస్తాయి.
2. శరీరానికి ప్రాణవాయువు బాగా లభిస్తుంది.
3 . రక్త శుద్ధి జరిగి అందలి చెడు అంతా బయటికి వెళ్లిపోతుంది.
4 . గుండెకు సత్తువ లభిస్తుంది.
5 . మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
6 . ప్రేగులు, నరాలు, నాడులు శుభ్ర పడతాయి.
8 . శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.
9 . ఆయుష్షు పెరుగుతుంది. ఇది అన్నిటికంటే మించిన విశేషం.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- మైదానంలోగాని, తోటలోగాని, తలుపులు తెరచియున్న గదిలోగాని, కంబళీ లేక బట్ట లేక ఏదేనీ ఆసనం మీద కూర్చొని ప్రాణాయామం చేయాలి.
- గాలి విపరీతంగా వీస్తూ ఉంటే ఆ గాలి మధ్య ప్రాణాయామం చేయకూడదు.- మురికిగా ఉన్న చోట, దుర్వాసన వస్తున్న చోట, పొగ వస్తున్న చోట ప్రాణాయా మం చేయకూడదు.
- సిగరెట్టు, బీడి, చుట్టపొగ వస్తున్న చోట ప్రాణాయామం చేయకూడదు.
- పొట్ట నిండుగా ఉన్నపుడు ప్రాణాయామం చేయకూడదు.
- ప్రాణాయామం చేసే ముందు, చేసిన తరువాత కూడా ఇతర యోగాసనాలు వేయవచ్చు. అయితే చివర శవాసనం వేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి.

# ఈ అవగాహన అత్యవసరమే..!



మీరు మిత్రుడితో కలిసి మాట్లాడుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నారు. అకస్మాత్తుగా అతడు స్పృహ తప్పాడు... ఏం చెయ్యాలి? ఇంట్లో ఒక్కసారిగా తాతయ్య మాటల్లో తడబాటు కనిపించింది... ఎందుకని? ఆ మార్పు ప్రమాదకరమా? రోడ్డు మీద వెళుతున్నపుడు అకస్మాత్తుగా ఒకరు ఫిట్స్‌తో పడిపోయారు... మనం ఏదైనా సాయం చెయ్యగలమా? ఎప్పుడూ లేనిది కడుపు పై భాగంలో నొప్పి అసిడిటి కావచ్చని అనుకుంటాము... అది నిజంగా అసిడిటినే అయి ఉంటుందా..? లేక మరేదైనా ప్రమాదకరక స్థితి కాదు కదా? ఇలాంటి వన్నీ ఒక్కోసారి అత్యవసర పరిస్థితులకు దారి తియ్యవచ్చు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను గుర్తించడం.., సమయానికి స్పందించడం... గురించిన వివరాలు

అత్యవసర పరిస్థితి చెప్పి రాదు; అది ఎప్పుడైనా ఎదురు కావచ్చు. ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎవరికైనా ఏర్పడనూ వచ్చు. అలాంటి స్థితిని ఎదుర్కోవడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి. అది మనతో ఉన్న వారు అకస్మాత్తుగా స్పృహ తప్పటం, ఎవరికైనా షాక్ కొట్టడం, ఎవరైనా పై నుంచి కింద పడిపోవడం, ఎప్పుడూ లేని విధంగా కడుపులో నొప్పి రావడం, ఇంట్లో ఎవరికైనా స్ట్రోక్ రావడం, రోడ్డు మీద ఎవరికైనా ఫిట్స్ రావడం ఇలా అత్యవసర స్థితి ఎప్పుడైనా ఏరూపంలోనైనా ఎదురు కావచ్చు. అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు ఎలా స్పందించాలనే విషయాల గురించి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి.

**స్పృహ తప్పితే...**


అనుకోకుండా మన వెంట ఉన్న వారు స్పృహ తప్పి పడిపోతే ముందుగా మనకు చాలా కంగారు కలుగుతుంది. ఏం చెయ్యాలో తోచదు. అయ్యో...అయ్యో... అనడం మినహా వెంటనే కర్తవ్యం బోధపడదు. అయితే స్పృహ తప్పిన వారిని ప్రమాదం నుంచి బయట పడెయ్యాలంటే అన్నింటికంటే ముందుగా మనం అలా కంగారు పడకుండా ఉండడం అవసరం. ఒకవేళ కంగారు పడినా వెంటనే సర్దుకోవాలి. పడిపోయిన వారిని గట్టిగా కుదిపి లేపి చూడాలి. గట్టిగా వారి పేరు పెట్టి పిలవాలి. ఒకవేళ వారు స్పందించగలిగితే అది ఒకింత మేలైన స్థితిగా భావించవచ్చు. ఎలాంటి స్పందన లేకపోయినట్టయితే సాయం కోసం ఎవరినైనా అభ్యర్థించడం మంచిది.

గొంతు కింద చెయ్యి పెట్టి అక్కడ కొట్టుకునే నాడిని పరీక్షించి చూడాలి. ఇక్కడ కొట్టుకునే నాడిని కెరొటెడ్ పల్స్ అంటారు. అక్కడి నాడీ స్పందన కనిపించకపోతే వెంటనే కార్డియోపల్మనరీ రీ సజిటేషన్(సీపీఆర్) అనే ప్రథమ చికిత్స చెయ్యాలి. ఇందులో భాగంగా ఒకచేతి మీద మరో చేతిని ఉంచి బాధితుడి ఛాతి మధ్య భాగంలో బలంగా ఒత్తిడి కలిగించాలి. ఈ ఒత్తిడి ఎంత బలంగా ఉండాలంటే లోపలికి ఛాతిని ఒత్తినపుడు అది దాదాపు రెండు అంగుళాల మేర లోపలికి వెళ్లాలి. అలా 30 సార్లు ఒత్తిడి కలిగించిన తర్వాత బాధితుడి ముక్కు మూసేసి నోటిని నోటితో మూసేసి బలంగా రెండు సార్లు ఊపిరి తిత్తులలలోకి గాలి ఊదాలి. ఇలా వంద సార్ల వరకు ఒత్తిడి కలిగించాలి. గాలి ఊదాలి. ఇది 30:2 నిష్పత్తిలో ఉండాలి. అంటే 30 సార్లు ఒత్తిడి కలిగించి 2 సార్లు గాలి ఊదాలి. ఇలా 5 నిమిషాలు చేసి తిరిగి సీపీఆర్ కొనసాగించాలి. నాడి తిరిగి కొట్టుకోవడం మొదలు పెట్టే వరకు ఈ చికిత్స కొనసాగించాలి.

ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫ్యూజర్ ఉపయోగిం చవచ్చు. ఇది ఆ సమయంలో షాక్ అవసరమా కాదా అనేది కూడా నిర్ణయిస్తుంది. దీనిలో మూడు బటన్స్ ఉంటాయి. మొదటిది ప్యాడ్స్‌ను బాధితులకు అమర్చడానికి, రెండోది హృదయస్పందనను విశ్లేషించడానికి, మూడోది షాక్ అవసరమా కాదా నిర్ణయించడానికి ఉపయోగపడతాయి. దీనిని ఎవరైనా ఉపయోగించవచ్చు. నిజానికి ఇది అన్ని పబ్లిక్ ప్లేస్‌లలో అందుబాటులో ఉండాలి. **మూర్ఛ** మూర్ఛతో బాధపడేవారిని చూసినపుడు చాలా భయం కలుగుతుంది. ఎలా స్పందించాలో కూడా అర్థం కాదు. అందరూ ఒకరకమైన ఆందోళనతో చుట్టూ చేరతారు. కొంత మంది కాస్త ధైర్యం చేసి వారి చేతికి ఏ ఇనుప వస్తువునో, తాళం చేతుల గుత్తినో అందించేందుకు ప్రయత్నం చేస్తారు. అయితే దీనితో పెద్దగా ప్రయోజనం లేదనేది నిపుణుల మాట. ఎవరికైనా మూర్ఛ వచ్చినపుడు కొన్ని ప్రత్యేకమైన జాగ్రత్తలు పాటించడం వల్ల రోగికి కొంత ఉపశమనం కలిగించిన వారిమవుతాము.

-మూర్ఛ వచ్చిన వారి చుట్టూ గుంపు కట్ట కూడదు.
-వారిని ఒడిసి పట్టుకునే ప్రయత్నం కూడా చెయ్యొద్దు, దగ్గరలో ఏవైనా గాయపరిచే వస్తువులు ఉంటే వాటిని దూరంగా తీసేస్తే చాలు
-మూర్ఛ నుంచి బయటపడిన వెంటనే తినడానికి ఏమీ ఇవ్వ కూడదు
-ఒక వైపుగా తిప్పి పడుకోబెట్టడం వల్ల మూర్ఛ సమయంలో వారి నోట్లోకి వచ్చిన లాలాజలం వంటి స్రావాలు ఊపిరితిత్తుల్లో చేరకుండా నివారించవచ్చు. అది ఎడమ వైపు తిప్పి పడుకోబెడితే మరీ మంచిది.

# టెన్షన్ జయించాలంటే ..



ఈ రోజుల్లో పసివాడు మొదలుకొనిపండుముసలి వరకు అందరూ ప్రతిదినం అనేకమార్లు వల్లించే మాట ఇది. ప్రతి దానికీ ఏదో తెలియనిఆందోళన. ఫలితంగా యవ్వన దశలోనేవివిధశారీరక,మానసికరుగ్మతలు.ఆధునిక జీవన విధానంలో సంక్లిష్టత వల్ల ఏర్పడుతున్న దు:స్థితి ఇది. ఒకవైపు సాంకేతిక వైజ్ఞానిక ప్రగతి, నవ నాగరికత వల్ల ఏర్పాటౌతున్న సుఖభోగాల...ఎన్నిఉన్నాఉద్విగ్నం, బెంగ, దిగులుకొత్త కొత్త తరహాల్లోఎదురౌతున్నాయివీటికి కారణాలేమిటి? పరిష్కారమేమిటి?.. మానసిక స్థైర్యం కొరవడటమే ఈ పరిస్థికి కారణం. నిజానికి దీనికి పరిష్కారం- పూర్తిగా ఆధారపడదగినది - మన పూర్వీకులే మనకు ఇచ్చారు. బాల్యం నుండే పెంచి పోషించుకుంటున్న పోటీ ప్రవృత్తిని ఒకరిని మించి పోవాలనే తాపత్రయం, అన్నిభోగసాధన లు తమకుఅందుబాటులో ఉండాలనే లాలస... ఈ విధమైన దృక్పథాలవలన అశాంతికి లోనౌతున్నాడు నవీన మానవుడు. ఆధ్యాత్మిక ధార్మిక ఆలోచనారవళినిపెంపొందించు కోవడమే దీనికి పరిష్కారం. ఎటువంటి పరిస్థితి ఎదురైనా వెంటనే ప్రతికూలం (Negative) గా స్పందించకుండా, ప్రశాంతతని కోల్పోకుండా మసలగలిగే అనుకూల (Positive) ధోరణిని అభ్యాసం చేయాలి.

ఎవరు ఆదర్శం?ఈ మానవలోకానికి 'మిశ్ర' లోకం అని పేరు. సుఖదు:ఖ మిశ్రణమే ఇహలోక వైఖరి. ఈ అనుభవాలకి ఎలా స్పందించాలి?

**దు:ఖేష్వనుద్విగ్నమనా: సుఖేషు విగత స్పృహ:।**
**వీతరాగ భయక్రోధ: స్థిత నీర్మునిరుచ్యతే ॥**

"దు:ఖంలో మనస్సు ఉద్విగ్నం చెందకుండా, సుఖాలలో అంటుకొని పొంగిపోకుండా, మోహం, క్రోధం, భయం వంటి వికారాలకు లోనుకాకుండా ఉండేవాడే స్థితప్రజ్ఞుడు" అని గీతాచార్యుని మాట జ్ఞాని మన:స్థితి 'సంయమనం' 'సమతుల్యం'గా ఉంటుంది. అలాంటి యోగిని మనం ఆదర్శంగా తీసుకొని పురోగమించిడం సుఖజీవన మార్గం. కానీ మనం అధిక సంపన్నుల్నీ, కీర్తిమంతుల్నీ మనకు 'మోడల్స్' గా ఎంచుకుంటాంగానీ, గొప్ప వ్యక్తిత్వాలను ఆదర్శాలుగా భావించం.పైగా మానసిక దృఢత్వమనేది ఏదో ఆధ్యాత్మిక వాదంగా పరిగణిస్తాం గానీ మానవుని వికాస వ్యక్తిత్వంగా లెక్కించం. ఆందోళన ముందువెనుకల్ని ఆలోచించనీయదు. కార్యశీలతకు భంగకరం కూడా. దూరాన వస్తున్న రామలక్ష్మణుల్ని మొదటి సారిగా చూసిన సుగ్రీవుడు విపరీతమైన టెన్షన్‌కి (ఉద్విగ్నానికి) లోనై, అటూ ఇటూ పచార్లు చేస్తుండగా, హనుమంతుడు గమనించి-" నువ్వు ప్రశాంతతని కోల్పోతే ఏపనీ చేయలేవు. వారిద్దర్నీ చూసి, 'వాలి నీ పైకి పంపిన బలవంతులైన యోధులు' అని నిర్ణయించుకొని భయపడుతున్నావు. కానీ అది రూఢి కాలేదు. ఏమీ తేలకుండానే ఉద్విగ్నపడే మనస్తత్వమున్న వాడు కార్యదక్షుడు కాలేడు" అని మందలించి, తాను స్వయంగా వెళ్ళి, రామలక్ష్మణుల సమాచారం గ్రహించాడు. వారిని సుగ్రీవునికి మిత్రులుగా చేసి మహోపకారం చేశాడు. కేవలం కథా దృష్టితో చూస్తే -మారీచుడు మాయాజాలంతో రాముని కంఠస్వరాన్ని అనుకరిస్తూ అరచిన ధ్వనికి - వేగిరపడిని సీతమ్మ ఆందోళనే మాటల్లో వర్ణించలేనంత టెన్షన్‌కి గురయింది. ఆ టెన్షనే చికరికి ఆమె అపహరణం వరకు దారితీసింది. భయచకితమైన మానసిక స్థితిలో తీసుకొనే నిర్ణయాలు ప్రమాదాలకి దారితీస్తాయి.

జరగవలసింది జరగకమానదు - అనే ధోరణి ఒక విధంగా మనశ్శాంతినీ, ఊరటనీ ఇస్తుందనేది వాస్తవమే. కానీ ఈ ధోరణి మన ప్రయత్నాన్ని కుంటుపరచదా? అని కొందరి సందేహం. ఏ సిద్ధాంతాన్నైనా ఎలా, ఎంతవరకు స్వీకరించాలి? అనేది మనయుక్తిపై ఆధారపడి ఉంటుంది భారతీయుల కర్మ సిద్ధాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే చక్కని మన:స్థితిని ఏర్పడుతుంది. కర్మకు తగ్గ ఫలితం అనుభవించక తప్పదు. మన ప్రయత్నం మనం చేసినా తొలగించలేని దానినే ప్రారబ్ధం అంటాం. పురుష ప్రయత్నం తో చేసినదే కదా! ఇది వరకటి కర్మలఫలానికే 'అదృష్టం' 'దైవం' 'భాగ్యం' అని పేరు. ప్రపంచంలో అందరూ ఒకేలా ఉండరు. ఎవరి 'అదృష్టం' వారిది. అలాగని ప్రయత్నం మానం. ప్రయత్నానికి 'పౌరుషం' అని పేరు. మన ప్రయత్నం దృఢంగా, ఏకాగ్రంగా, పట్టుదలగా ఉంటే అదృష్టాన్ని కూడా మార్చవచ్చు అని శాస్త్రం. 'అదృష్టం ఇంతే' అని సరిపెట్టుకునే స్థితి మనసుకి శాంతినిస్తుంది. పట్టుదలగా కృషి చేసేవాడూ ఆందోళనని ప్రక్కకి పెడతాడు.రెండింటికీ చెందని బలహీనుడే అశాంతి పాలవుతాడు. మన కృషికి తగినదీ, మన అవసరాలను తీర్చేదీ అయిన సంపాదనతో తృప్తిపడడం నేర్చుకోవాలి. పోటీ, ఆందోళన లేకుండా ధర్మబద్ధంగా ప్రయత్నించడానికి సాధన చేయాలి. కొందరు ఎల్లప్పుడూ తాము‌న్న ఉద్యోగం, స్థితి విషయంలో అసంతృప్తి గానే గడుపుతుంటారు. 'గతిలేక అందులో ఉన్నాం' అనే భావన లో ఉంటారు. ఇది కూడా ఒక విధమైన మానసిక రుగ్మతయే. 'ఎవరెక్కడవుండాలో అక్కడేసరిగ్గాఉంచబడ్డారు' (Everyone is rightly placed) అనే ఆంగ్లనానుడి కర్మ సిద్ధాంతానికి దగ్గరిదే.

# చిత్రభాను

## నలభై ఏళ్ల మాఫియా లీడర్‌గా శర్వానంద్!



వైవిధ్యమైన కథలను ఎన్నుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న యంగ్ హీరో శర్వానంద్. ఆసక్తికరమైన సినిమాలు చేస్తూ ఈ మధ్య కాలంలో మంచి విజయాలు అందుకున్నాడు. తన కొత్త సినిమా వస్తుందంటే ప్రేక్షకుల దృష్టిని అటువైపు తిప్పుకునేంతగా ఎదిగాడు. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో మహానుభావుడు సినిమాలో శర్వానంద్ నటిస్తున్నాడు. ఈ సినిమా తరువాత సుధీర్ వర్మ దర్శకత్వంలో శర్వా ఓ సినిమా చేయడానికి ప్లాన్ చేస్తున్నాడు. సితార ఎంటర్టైన్మెంట్స్ సంస్థ నిర్మించే ఈ సినిమాను ఆసక్తికర కథతో తెరకెక్కించబోతున్నారని తెలుస్తోంది.

గతంలో కమల్ హాసన్ నటించిన నాయకుడు సినిమాకు దగ్గరగా ఈ సినిమా ఉంటుందని అంటున్నారు. ఈ సినిమాలో కూడా ఓ సామాన్య వ్యక్తి మాఫియా లీడర్‌గా ఎలా ఎదిగాడనే విషయాన్ని చూపించనున్నారట. అంతేకాకుండా ఈ సినిమాలో శర్వా కొంత సమయం పాటు నలభై ఏళ్ల వయసు గల మాఫియా లీడర్‌గా కనిపించబోతున్నాడని సమాచారం. గతంలో మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు సినిమాలో కూడా శర్వా కొద్దిసేపు నడి వయసు కలిగిన వ్యక్తి పాత్రలో కనిపించాడు. ఇప్పుడు మాఫియా లీడర్‌గా కనిపించడానికి రెడీ అవుతున్నాడు.

## జగదేకవీరుడు అతిలోక సుందరిని తలపిస్తుంది!



ఆకాష్‌కుమార్, మిస్తీ చక్రవర్తి జంటగా నటిస్తున్న తాజా చిత్రం శరభ. ది గాడ్ అని ఉపశీర్షిక. యన్.నరసింహారావు దర్శకత్వం వహిస్తున్నారు. అశ్వనికుమార్ సహదేవ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను హీరో చిరంజీవి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని క్లిప్పింగ్స్ చూశాను. జయప్రద, ఆకాష్‌ల నటన అద్భుతంగా వుంది. దర్శకుడు నరసింహారావు ఆషామాషీగా సినిమాను తెరకెక్కించలేదని అర్థమైంది. ఇదొక సోషియో ఫాంటసీ. దేవుడు, దయ్యం, మనిషి మధ్య జరిగే కథ. నేను చేసిన సినిమాలతో పోల్చాలంటే జగదేకవీరుడు అతిలోక సుందరిలా వుంటుంది. సినిమాలో జయప్రద నటన చూసి ఆశ్చర్యమేసింది. తను గర్భం ధరించి పిల్లాడిని కనే సమయంలో దయ్యం బిడ్డను చంపాలనుకునే సందర్భంతోపాటు పిల్లాడు పుట్టిన తరువాత దయ్యం జయప్రదను ఆవహించి బిడ్డను చంపేయాలని ప్రయత్నించేటప్పుడు... జయప్రద పాత్ర పడే తపన చూసి ఒళ్లు గగుర్పాటుకు గురయ్యింది.

ఆ సన్నివేశంలో జయప్రద నటన చూసి వావ్ అనకుండా వుండలేం. క్లైమాక్స్‌లో ఆకాష్ నరసింహస్వామిగా మారే సమయంలో అతనిలో కలిగే మార్పులు, అతని నటనను అభినందించకుండా వుండలేకపోయాను. సినిమా టేకింగ్ చూసిన తరువాత దర్శకుడు నరసింహా మాటల మనిషి కాదు చేతల మనిషి అని అర్థమైంది. ఛాయాగ్రహణం, గ్రాఫిక్స్ అత్యద్భుతంగా వున్నాయి. సినిమా సెన్సేషనల్ హిట్ అవుతుంది అన్నారు. జయప్రద మాట్లాడుతూ చాలా సినిమాల్లో నటించమని నన్ను కోరినా నటనకు ఆస్కారమున్న పాత్రనే చేయాలని ఎదురు చూశాను. ఆ సమయంలో నన్ను వెతుక్కుంటూ వచ్చిన చిత్రమిది. అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతున్న సోషియో ఫాంటసీ చిత్రమిది. ఆకాష్‌కు పెద్ద బ్రేక్‌నిస్తుంది అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ మంచి చెడుల మధ్య సాగే పోరే ఈ చిత్రం. పగ, ప్రతీకారం నేపథ్యంలో సాగుతుంది. తండ్రి సెంటిమెంట్‌తో పాటు నరసింహస్వామి మహత్యాన్ని కూడా ఈ చిత్రంలో చూపిస్తున్నాం అన్నారు. గొప్ప సినిమా అవుతుందనే నమ్మకముందని హీరో ఆకాష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ కపాడియా, మిస్తీచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## తమిళ రీమేక్‌లో...



గతంలో రవితేజ నుంచి ఏడాదికి నాలుగైదు సినిమాలు గ్యారెంటీగా వచ్చేవి. ప్రస్తుతం తన పంథాను మార్చుకున్నారాయన. సంఖ్య కంటే కొత్తదనంతో కూడిన కథాంశాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. తాజాగా రవితేజ ఓ తమిళ రీమేక్‌లో నటించనున్నట్లు తెలిసింది. జయం రవి కథానాయకుడిగా తమిళంలో రూపొందిన బోగన్ చిత్రం కమర్షియల్‌గా మంచి వసూళ్లను సాధించింది. ప్రభుదేవా నిర్మాణంలో సూపర్ నాచురల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ రీమేక్‌లో రవితేజ కథానాయకుడిగా నటించనున్నట్లు సమాచారం. మాతృకను తెరకెక్కించిన లక్ష్మణన్ తెలుగు రీమేక్‌కు దర్శకత్వం వహించనున్నట్లు తెలిసింది. ఇందులో రవితేజకు జోడీగా కేథరిన్ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. విజయదశమికి ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకురానున్నట్లు సమాచారం. ప్రస్తుతం అనిల్‌రావిపూడి దర్శకత్వంలో రాజా ది గ్రేట్ చిత్రంలో నటిస్తున్నారు రవితేజ. ఇందులో అంధుడిగా ఆయన పాత్ర వైవిధ్యంగా సాగనుంది. దీనితో పాటు టచ్ చేసి చూడు చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నారాయన.



## ఎన్టీఆర్ సినిమాలో తమన్నా ఐటమ్ సాంగ్!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తోన్న చిత్రం జై లవ కుశ. బాబీ దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాలో ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేయడం, దానికి తగ్గట్లుగా నివేదా థామస్, రాశీఖన్నా, నందితను హీరోయిన్లను తీసుకోవడం తెలిసిందే. ఈ సినిమాకు ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం, ముగ్గురు ముద్దుగుమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటే తాజాగా మరో స్పెషల్ ఎట్రాక్షన్ జతకాబోతుందని సమాచారం. అదేంటంటే.. ఈ సినిమాలో ఓ స్టార్ హీరోయిన్‌తో స్పెషల్ సాంగ్ చేయించాలని చిత్రబృందం భావిస్తోందట. ఆ స్టార్ హీరోయిన్ మరెవరో కాదు.. మిల్కీబ్యూటీ తమన్నా. ప్రస్తుతం తమ్ము బ్యూటీకి అవకాశాలు తగ్గిపోయాయి. తమిళంలో ఓ సినిమా, హిందీలో మరో సినిమాలో నటిస్తున్న తమన్నా.. తెలుగులో కల్యాణ్ రామ్‌తో ఓ సినిమా చేయబోతుందని అంటున్నారు. మరే ఇతర ప్రాజెక్ట్స్ తమన్నా అంగీకరించలేదు. ఈ క్రమంలో ఎన్టీఆర్ సినిమాలో ఐటెమ్ సాంగ్ కోసం ఆమెను సంప్రదించినట్లుగా తెలుస్తోంది. ఎన్టీఆర్‌తో గతంలో ఊసరవెల్లి సినిమాలో నటించిన తమన్నా తాజా ప్రపోజల్‌ను అంగీకరించినట్లు తెలుస్తోంది. దీనికి తోడు జై లవ కుశపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఇలాంటి సినిమాలో సాంగ్ చేసి మళ్లీ తెలుగులో తన అవకాశాలను పెంచుకోవాలని తమన్నా అనుకుంటోందట. ఎన్టీఆర్ గత చిత్రం జనతా గ్యారేజ్‌లో స్టార్ హీరోయిన్ కాజల్‌తో ఐటెమ్ సాంగ్ చేయించారు. ఆ పాట ఎంతగా సక్సెస్ అయిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు తమన్నా పాట ఎన్టీఆర్‌కు ఎంతవరకు కలిసొస్తుందో.. చూడాలి!

## క్వీన్ రీమేక్‌లో కాజల్..




కంగనారనౌత్ కథానాయికగా నటించిన హిందీ చిత్రం క్వీన్ (2014) దక్షిణాది భాషల్లో రీమేక్ కాబోతున్న విషయం తెలిసిందే. ప్రముఖ నటుడు, దర్శకనిర్మాత త్యాగరాజన్ ఈ చిత్ర పునర్నిర్మాణ హక్కుల్ని సొంతం చేసుకున్నారు. దక్షిణాది రీమేక్‌లో ఎవరు నటిస్తారనే విషయంలో కొంతకాలంగా సందిగ్ధత నెలకొంది. ప్రముఖ హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా క్వీన్ తమిళ రీమేక్‌లో కాజల్‌అగర్వాల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని కాజల్ స్వయంగా వెల్లడించింది. క్వీన్ చిత్రం నాకు బాగా నచ్చింది. అయితే దక్షిణాది ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా స్క్రిప్ట్‌లో మార్పులు చేస్తున్నారు. హిందీలో కంగనారనౌత్ అత్యద్భుతమైన నటనను కనబరచింది. నాదైన శైలిలో సినిమాలోని పాత్రను రక్తి కట్టిస్తాననే నమ్మకముంది అని చెప్పింది కాజల్ అగర్వాల్. ఆమె తెలుగులో నటించిన నేనే రాజు నేనే మంత్రి చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం కాజల్ అగర్వాల్ తెలుగులో ఎమ్మెల్యే చిత్రంలో నటిస్తున్నది.

## కనిపించని శత్రువు కోసం



భూకంపాలు, సునామీలే కాకుండా భూప్రపంచంపై విధ్వంసాల్ని సృష్టించే కొన్ని మానవ శక్తులు ఉంటాయి. అలాంటి వారిని అంతమొందించడమే లక్ష్యంగా పోరాడుతుంటాడు స్పైడర్. అతడి సంకల్పం నెరవేరిందా? లేదా? కంటికి కనిపించని శత్రువులను అతడు ఎలా ఎదుర్కొన్నాడు? అనేది తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే అంటున్నారు ఎన్వీ ప్రసాద్. ఎన్.వి.ఆర్ సినిమా, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఆయన నిర్మిస్తున్న చిత్రం స్పైడం మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్నారు. ఏ.ఆర్. మురుగదాస్ దర్శకుడు. రకుల్‌ప్రీత్‌సింగ్ కథానాయిక. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. నిర్మాత మాట్లాడుతూ థ్రిల్లర్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. గూఢచార వ్యవస్థ పనితీరు నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ఒక పాట మినహా సినిమా చిత్రీకరణ పూర్తయింది. బ్యాలెన్స్‌గా మిగిలిన గీతాన్ని ఈ నెల 25 నుంచి రొమేనియాలో చిత్రీకరిస్తున్నాం. 31తో ఈ పాట చిత్రీకరణ పూర్తవుతుంది. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని తెలిపారు. ఎస్.జె. సూర్య ప్రతినాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హేరీస్ జయరాజ్, సినిమాటోగ్రఫీ: సంతోష్ శివన్, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, సమర్పణ: ఠాగూర్ మధు.

## సూక్ష్మ శస్త్రచికిత్సలపై కార్యశాల



హైదరాబాద్ : బంజారాహిల్స్‌లోని బసవతా రకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (బీఐఏసీహెచ్ అండ్ ఆర్‌ఐ)లో ప్రత్యేక లైవ్ మైక్రో సర్జికల్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో బీఐఏసీహెచ్ అండ్ ఆర్‌ఐ సీఈవో డా. ఆర్‌వీ ప్రభాకర్‌రావు పాల్గొని జ్యోతివెలిగించి కార్యక్రమాలను ఆరంభించారు. కార్యశాలలో భాగంగా రొమ్ము, నోరు, గొంతు క్యాన్సర్ వ్యాధుల కారణంగా కోల్పోయిన అవయవాల స్థానంలో మైక్రో, ప్లాస్టిక్, కాస్మొటిక్ శస్త్రచికిత్స పద్ధతులను ఉపయోగించి వాటిని పునర్నిర్మాణం చేయడం పై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్‌వీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ, క్యాన్సర్ చికిత్సలో నానాటికీ సూక్ష్మ శస్త్రచికిత్సల ప్రాముఖ్యం పెరుగుతోందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డా.టి.సుబ్రమణ్యేశ్వరరావు సహా ప్రముఖ మైక్రో, ప్లాస్టిక్, కాస్మొటిక్ సర్జన్లు డా.ప్రభా యాదవ్, డా.వెంకట రామకృష్ణన్, డా.రాజేంద్ర నెహతా, డా.ముకుందరెడ్డి, డా.రాంబాబు, డా.రాజేష్ తదితరులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ, వైద్యశాస్త్రంలో ముఖ్యంగా శస్త్రచికిత్సల్లో అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒకరికొకరు అందిపుచ్చుకోవడంలో ఇలాంటి సదస్సులు కీలకపాత్ర వహిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిపుణులైన వైద్యులు నిర్వహించిన శస్త్రచికిత్సలను ప్రత్యక్ష ప్రసారం చేశారు.

## బావన సీటు ఆమ్ ఆద్మీదే!

దిల్లీ: దిల్లీలోని బావన నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఆమ్‌ఆద్మీ పార్టీ విజయం సాధించింది. ఆగస్టు 23న బావన నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరిగింది. సోమవారం ఓట్ల లెక్కింపు చేపట్టగా ఆప్ అభ్యర్థి రామ్ చంద్ర.. తన సమీప ప్రత్యర్థి, భాజపా అభ్యర్థి వేద్ ప్రకాశ్‌పై 24వేల ఓట్లకు పైగా మెజార్టీతో గెలుపొందారు.

బావన నియోజకవర్గ ఎమ్మెల్యే వేద్ ప్రకాశ్ ఆమ్ ఆద్మీ పార్టీ నుంచివె%దొలగి భాజపాలో చేరిన విషయం తెలిసిందే. వేద్ ప్రకాశ్ తన పదవికి రాజీనామా చేయడంతో బావన ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా..ఉపఎన్నికలో వేద్ ప్రకాశ్ భాజపా నుంచి పోటీ చేశారు. దీంతో ఆమ్ ఆద్మీకి ఈ ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారింది. బుధవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కాగా.. తొలి రౌండ్లలో కాంగ్రెస్ ఆధిక్యంలో ఉంది. ఎనిమిదో రౌండ్ కౌంటింగ్ తర్వాత అనూహ్యంగా ముందంజలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ.. ఆ ఆధిక్యాన్ని కొనసాగించింది. తొలుత ఆధిక్యంలో ఉన్న కాంగ్రెస్ ఫలితాల్లో మూడో స్థానానికి పడిపోయింది. భాజపా రెండో స్థానాన్ని దక్కించుకుంది. బావన విజయంతో ఆమ్ ఆద్మీ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు.

## గోవా ఉపఎన్నికలో
# పారికర్ విజయం



పనాజీ: గోవాలోని పనాజీ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ విజయం సాధించారు. సోమవారం జరిగిన ఓట్ల లెక్కింపులో పారికర్ సమీప కాంగ్రెస్ అభ్యర్థి గిరీశ్ రయ చోదంకర్‌పై 4803 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మరో నియోజకవర్గం వాల్పోయిలో భాజపా అభ్యర్థి విశ్వజిత్ రానే ఆధిక్యంలో ఉన్నారు.

ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన గోవా అసెంబ్లీ ఎన్నికల్లో 13 స్థానాల్లో గెలుపొందిన భాజపా.. చిన్న పార్టీల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీంతో కేంద్ర రక్షణ మంత్రిగా ఉన్న మనోహర్ పారికర్.. ఆ పదవికి రాజీనామా చేసి గోవా సీఎంగా బాధ్యతలు చేపట్టారు.

ఆగస్టు 23న దేశవ్యాప్తంగా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరిగాయి. గోవాలోని పనాజీ, వాల్పోయి, దిల్లీలోని బావన, ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో ఈ ఎన్నికలు జరిగాయి. నేడు ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. బావన నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆధిక్యంలో ఉండగా.. నంద్యాలలో తెలుగుదేశం పార్టీ ముందంజలో ఉంది.

## బిహార్‌లో 482కి చేరిన మృతులసంఖ్య

పట్నా: బిహార్, ఉత్తరప్రదేశ్‌లలో వరద బీభత్సం కొనసాగుతోంది. బిహార్‌లో గడిచిన 24 గంటల్లో 42 మంది ప్రాణాలు కోల్పోగా.. మృతుల సంఖ్య 482కి చేరింది. 19 జిల్లాల పరిధిలోని 1.72కోట్ల మంది ఇంకా వరద ముంపులోనే ఉన్నట్లు అధికారులు తెలిపారు. జాతీయ విపత్తు నివారణ సంస్థకు చెందిన 28 బృందాలు, 630 మంది సైనికులు వివిధ బృందాలుగా విడిపోయి పునరావాస, సహాయక చర్యలు చేపడుతున్నారు. బిహార్‌లోని పలు ప్రాంతాల్లో ఈ రోజు కూడా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. అటు ఉత్తరప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలు నీటిముంపులోనే ఉన్నా.. వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పట్టింది. యూపీలో గత 24 గంటల్లో ఐదుగురు మృతి చెందగా.. మొత్తం మృతుల సంఖ్య 101కి చేరింది. యూపీలోని 2వేల గ్రామాల్లో వరద ప్రభావం తగ్గగా 3వేలకు పైగా గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఒంటికాలితోనైనా
# పాకిస్థాన్‌పై ఆడుతా !



న్యూఢిల్లీ : 2019 వరల్డ్ కప్‌లో ఆడబోయే భారత జట్టులో మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీకి స్థానముంటుందా? ఉండదా? అన్న చర్చ ఇప్పుడు కొనసాగుతోంది. ధోనీకి చోటుపై సెలెక్టర్లు ఇప్పడే ఏమీ చెప్పకపోయినా.. అతను ఉండీ తీరాల్సిందేనని వీరేంద్ర సెహ్వాగ్ వంటి సీనియర్ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ చర్చ నేపథ్యంలోనే ధోనీ ఇటీవల శ్రీలంకతో ఆడిన రెండు, మూడో వన్డేలలో రాణించి విమర్శకుల నోటికి తాళం వేశాడు. క్లిష్ట సమయాల్లో జట్టును విజయతీరాలకు (మ్యాచ్ ఫినిషింగ్) చేర్చే బాధ్యతను తీసుకోవడంలో తనకు తానే సాటని మరోసారి నిరూపించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇటీవల మీడియాతో మాట్లాడిన భారత క్రికెట్ జట్టు చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ ధోనీ గురించి ఆసక్తికర విషయాలు తెలిపారు. గత ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్ సందర్భంగా ధోనీ గాయపడ్డప్పటి సందర్భాన్ని ఆయన వివరించారు. 'అర్ధరాత్రి జిమ్‌లో కసరత్తులు చేస్తున్న సమయంలో ధోనీ వెయిట్ ఎత్తబోతుండగా.. వెన్నులో పట్టుకున్నట్టు అయింది. దీంతో అతను బరువు వదిలేశాడు. అదృష్టంకొద్దీ ఆ బరువు అతనిపై పడలేదు. కానీ, అతను నడవలేకపోయాడు. దాదాపు పాకుతూ అల్లారం బెల్ మోగించాడు. వైద్య సిబ్బంది వెంటనే వచ్చి అతనికి ప్రథమ చికిత్స అందించి.. స్ట్రేచర్‌పై తీసుకెళ్లారు. అప్పట్లో సెలెక్టర్‌గా ఉన్న నేను ఢాకాకు చేరుకోగానే ధోనీకి ఏమైంది అన్న ప్రశ్న విలేకరుల నుంచి ఎదురైంది. నా వద్ద సమాధానం లేదు. పాకిస్థాన్‌కు మ్యాచ్ ఎంతో కీలకమైనది. ఏమైందో తెలుసుకోవడానికి నేను ధోనీ గదికి వెళ్లాను. 'ఆందోళన చెందకండి ఎమ్మెస్కే భాయ్' అంటూ ధోనీ చెప్పాడు.

నేను ఎన్నిసార్లు అడిగినా అదే చెప్పాడు. కానీ చాలా కీలకమైన మ్యాచ్ కావడంతో మాపై ఒత్తిడి పెరుగుతూ వచ్చింది. ఆ తెల్లారి నేను ధోనీ గదికి వెళ్లాను. అప్పుడు కూడా ఆందోళనేమీ వద్దని ధోనీ చెప్పాడు. (ఒక సెలెక్టర్‌గా) ధోనీ మాటలను నేను తేలిగ్గా తీసుకోలేకపోయాను. వెంటనే అప్పటి చీఫ్ సెలెక్టర్ సందీప్ పాటిల్‌కు ఫోన్ చేసి మాట్లాడాను. ధోనీ స్థానంలో ఆడేందుకు వెంటనే పార్థివ్ పటేల్‌ను సాయంత్రంకల్లా ఢాకా పంపారు. అతను జట్టుతో చేరాడు. ఆ రాత్రి 11 గంటల సమయంలో నేను ధోనీ గదికి వెళ్లాను. అతను అక్కడ లేడు. స్విమ్మింగ్‌పూల్ సమీపంలో నడిచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. దాదాపు పాకుతున్నట్టు అతని పరిస్థితి ఉంది. తను నడిచేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పాడు.

## ఐపీఎల్‌పై ఆదేశాలిచ్చేందుకు సుప్రీం నో!

దిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ మీడియా హక్కుల్ని ఈ-వేలం వేసేలా ఆదేశాలిచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. భాజపా నేత సుబ్రమణ్య స్వామి వేసిన వ్యాజ్యాన్ని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, న్యాయ మూర్తులు ఏఎం ఖన్విల్కర్, డీవై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం పరిగణ నలోకి తీసుకోలేదు. రూ.30,000 కోట్ల విలువైన ఐపీఎల్ మీడియా హక్కుల్ని అత్యంత పారదర్శక విధానమైన ఈ-వేలం ద్వారా నిర్వహించాలని స్వామి వ్యాజ్యం వేసిన సంగతి తెలిసిందే. బీసీసీఐ పాలకుల కమిటీ తరఫున సీనియర్ న్యాయవాది పరాగ్ త్రిపాఠి వాదించారు. మీడియా హక్కుల కోసం పోటీదారులు సీల్డ్ కవర్‌లో బిడ్లు దాఖలు చేస్తారని ఆయన ధర్మాసనానికి వివరించారు. హక్కులు ఎవరికి కట్టబెట్టాలో నిర్ణయించేందుకు ఇంతకన్నా మంచి ప్రత్యామ్నాయం ఉండదన్నారు. ఐతే బీసీసీఐ పాలక వర్గంలో వార్తా ఛానల్ వ్యక్తి ఉన్నారని ఇది పరస్పర ప్రయోజనం కిందకు వస్తుం దని స్వామి అన్నారు. ఈ అంశంపై తాను మధ్యంతర వ్యాజ్యం దాఖలు చేయాలను కుంటున్నట్లు తెలిపారు.

## బిహార్‌లో 482కి చేరిన మృతులసంఖ్య

పట్నా: బిహార్, ఉత్తరప్రదేశ్‌లలో వరద బీభత్సం కొనసాగుతోంది. బిహార్‌లో గడిచిన 24 గంటల్లో 42 మంది ప్రాణాలు కోల్పోగా.. మృతుల సంఖ్య 482కి చేరింది. 19 జిల్లాల పరిధిలోని 1.72కోట్ల మంది ఇంకా వరద ముంపులోనే ఉన్నట్లు అధికారులు తెలిపారు. జాతీయ విపత్తు నివారణ సంస్థకు చెందిన 28 బృందాలు, 630 మంది సైనికులు వివిధ బృందాలుగా విడిపోయి పునరావాస, సహాయక చర్యలు చేపడుతున్నారు. బిహార్‌లోని పలు ప్రాంతాల్లో ఈ రోజు కూడా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు.

అటు ఉత్తరప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలు నీటిముంపులోనే ఉన్నా.. వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పట్టింది.

యూపీలో గత 24 గంటల్లో ఐదుగురు మృతి చెందగా.. మొత్తం మృతుల సంఖ్య 101కి చేరింది.

యూపీలోని 2వేల గ్రామాల్లో వరద ప్రభావం తగ్గగా 3వేలకు పైగా గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

## బ్రిటన్ రోడ్డు ప్రమాదంలో 8 మంది భారతీయులు మృతి



బ్రిటన్‌లో గత 24 ఏళ్లలో ఇంతకుముందెప్పుడూ లేనివిధంగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు సహా మొత్తం 8 మంది భారతీయులు దుర్మరణంపాలయ్యారు. విప్రో సంస్థలో ఐటీ నిపుణులుగా పనిచేస్తున్న భారతీయులు, వారి కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న మినిబస్సు బకింగ్‌హామ్‌షైర్‌లోని న్యూపోర్ట్ ప్యాగ్నెల్ వద్ద ఎం1 హైవేపై ప్రమాదానాకి గురైంది. భారతీయులు ప్రయాణిస్తున్న బస్సు రెండు లారీల మధ్య నుజ్జునుజ్జైంది. విప్రోలో పనిచేస్తోన్న ముగ్గురు ఐటీ నిపుణులు ఈ ప్రమాదంలో మృతి చెందగా మరో ఉద్యోగి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదే ప్రమాదంలో మృతిచెందిన బస్సు డ్రైవర్ సిరియక్ జోసెఫ్ సైతం భారత సంతతికి చెందిన వ్యక్తే. కేరళకి చెందిన సిరియక్ జోసెఫ్ గత 15 ఏళ్లుగా నాటింగ్‌హామ్‌లోని షెర్వుడ్‌లో డ్రైవర్‌గా స్థిరపడ్డారు. జోసేఫ్‌కి ఇద్దరు పిల్లలున్నారు.

విప్రో యూకే ఆపరేషన్స్, సపోర్ట్ విభాగం అధిపతి రమేష్ ఫిలిప్స్ టైమ్స్ ఆఫ్ ఇండియాతో మాట్లాడుతూ.. తమ తోటి ఉద్యోగులైన కార్తికేయన్ రామసుబ్రహ్మణ్యన్ పుగలూరు, రిషి రాజీవ్ కుమార్, వివేక్ భాస్కరన్‌లు ఈ ప్రమాదంలో దుర్మరణం పాలవడం తమని తీవ్ర విచారానికి గురిచేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే ప్రమాదంలో గాయపడిన మరో సహోద్యోగి మనో రంజన్ పన్నీర్ సెల్వం త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. మృతుల కుటుంబీకులకి తమ ప్రగాఢ సంతాపం ప్రకటించిన రమేష్ ఫిలిప్స్ వారికి అండగా నిలుస్తాం అని అన్నారు.

హాలీడే ట్రిప్‌లో భాగంగా ఇంగ్లాండ్‌లో వున్న తమ కుటుంబీకులని కలిసేందుకు వెళ్లిన భారతీయులు ఈ ప్రమాదంలో మృతిచెందారు. బాధితులు, వారి కుటుంబాలకి అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టామని లండన్‌లోని ఇండియన్ హై కమిషనర్ తెలిపారు. ఈ ప్రమాదానికి కారణమైన ఇద్దరు ట్రక్కు డ్రైవర్లని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఒకరు మోతాదుకు మించి మద్యం తాగి వాహనం నడిపి నట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

ప్రమాదానికి కారణమైన ఫెడెక్స్ వాహనం, ఏఐఎం లాజిస్టిక్స్ వాహనం పూర్తిగా దెబ్బతిన్న తీరు చూస్తే ప్రమాదం తీవ్రత ఏ స్థాయిలో వుంది ఇట్టే అర్థమవుతుంది. ఈ ఘటనపై స్పందించిన ఏఐఎం లాజిస్టిక్స్ డైరెక్టర్ ఇస్మాయిల్ ఎల్మగ్డూబ్.. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకి ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

# సేంద్రీయ వ్యవసాయం భేష్

మెట్‌పల్లి: సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాకుండా ఆరోగ్యదాయకమైన పంటలు పండుతాయని జిల్లా పాలనాధికారి శరత్ పేర్కొన్నారు. మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌లో గతంలో రాష్ట్ర ఉత్తమ రైతుగా పురస్కారం అందుకున్న రాజారపు భూమేశ్వర్ వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఐదెకరాల్లో వరిని పూర్తిస్థాయిలో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నానని ఆ రైతు పాలనాధికారికి చెప్పారు. రసాయన ఎరువులు వాడకుండా వర్మీ కంపోస్టును ఎరువుగా, ఆవు పేడ, మూత్రంతో జీవామృతం, కషాయాలు తయారు చేస్తూ పంటకు సోకిన తెగుళ్లకు పిచికారి చేస్తున్నట్లు వివరించారు. అలాగే ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద 5 గుంటల స్థలంలో నిర్మించుకున్న నీటికుంట (ఫాంపాండ్)ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూమేశ్వర్ సేంద్రియ సాగు తీరు అభినందనీయమన్నారు. ఆయనను తోటి రైతులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.



**10 రోజుల్లో మొక్కల లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు...**

జిల్లాలో వచ్చే 10 రోజుల్లోగా కోటి 32 లక్షల మొక్కలు నాటి, హరితహారం లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని జిల్లా పాలనాధికారి శరత్ పేర్కొన్నారు. మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌లో హరితహారంలో భాగంగా గీత కార్మిక సొసైటీ స్థలంలో నాటుతున్న ఈత మొక్కలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈత మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 90 లక్షల మొక్కలు నాటినట్లు చెప్పారు. 11 లక్షల ఈత మొక్కలను నాటడం జరుగుతుందని, సొసైటీ సభ్యులను వాటిని సంరక్షించాలని సూచించారు. వాటికి నీటి సౌకర్యం, బోర్లు ఉన్న చోట్ల బిందుసేద్యం యూనిట్లను అందజేస్తున్నామన్నారు. జిల్లాలోని 330 గ్రామ పంచాయతీల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. కాగా గ్రామంలో 60 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, 42,500 గుంతలు తీశామని, 34500 మొక్కలు నాటినట్లు మెట్లచిట్టాపూర్ సర్పంచి సింగిరెడ్డి రాజేందర్‌రెడ్డి పాలనాధికారికి చెప్పగా, సంతోషం వ్యక్తం చేశారు. ఇంకుడు గుంతలు నిర్మించుకున్న డబ్బులు, వేతనాలు రాలేదని పలువురు ఉపాధి కూలీలు కలెక్టర్ ఎదుట వాపోయారు.




VIJAYABHANU - Hyderabad
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com